PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 278 | విజయవాడ, గురువారం 11 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 11 May 2023 | Rs

మేజర్ సబ్జెక్టు ఒక్కటే

- డిగ్రీలో కొత్త విధానం
- 2023-24 నుంచి అమలు
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

2



బాక్సింగ్‌లో పతకాల పంట

- సత్తా చాటిన హుసాముద్దీన్, దీపక్, నిషాంత్
- ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

8

కన్నడనాట బిజెపికి ఎదురుదెబ్బ !

మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్‌లో కాంగ్రెస్‌కే మొగ్గు • జెడిఎస్ కింగ్‌మేకర్

బెంగళూరు : కర్ణాటకలో బిజెపి ప్రభుత్వ పతనం ఖాయమని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. ఎగ్జిట్ పోల్ ఫలితాల ప్రకారం కాంగ్రెస్ పుంజుకోవడం ఖాయమని తేలింది. 224 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న కర్ణాటకలో పూర్తి మెజారిటీకి 113 సీట్లు కావాలి. కాంగ్రెస్‌కు 120కు పైగా స్థానాలు వస్తాయని, బిజెపికి ఈసారి వంద కూడా రావని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. జెడి(ఎస్)కు 20 స్థానాలు వరకూ వస్తాయని ఫలితాలు చెబుతున్నాయి.

పీపుల్స్ పల్స్ సంస్థ - సౌత్‌ఫస్ట్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ సర్వే ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 107-119, బిజెపికి 78-90, జెడి (ఎస్)కు 23-29, ఇతరులకు 1-3 సీట్లు వచ్చే అవకాశం ఉంది. మార్జిన్ ఆఫ్ ఎర్రర్ ప్లస్ ఆర్ మైనస్ 2 శాతం. కర్ణాటకలో అధికారపీఠం కైవసం చేసుకోవాలంటే 113 సీట్లు గెలవాలి. ఈ సర్వే ప్రకారం కాంగ్రెస్-బిజెపి మధ్య ఓట్ల వ్యత్యాసం 6 శాతం ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీకి 42 శాతం, బిజెపికి 36 శాతం, జెడి(ఎస్)కు 16 శాతం అవకాశం ఉంది. మార్జిన్ ఆఫ్ ఎర్రర్ ప్లస్ ఆర్ మైనస్ 2 శాతం. 2018 ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 4 శాతం ఓట్లను అధికంగా పొందుతుండగా, బిజెపి 0.35 శాతం, జెడీ(ఎస్) 2.3 శాతం ఓట్లను కోల్పోయే అవకాశాలు ఉన్నట్టు పీపుల్స్‌పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడైంది.

సిఎంగా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అని 42 శాతం మంది, ప్రస్తుత ముఖ్యమంత్రి బస్వరాజ్ బొమ్మై అని 24 శాతం, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి అని 17 శాతం, మాజీ సిఎం బి.యడియూరప్ప అని 14 శాతం మంది, డి.కె.శివకుమార్ అని 3 శాతం మంది కోరుకుంటున్నారని ఈ సర్వే తెలిపింది. కర్ణాటకలోని మొత్తం ఆరు రీజియన్లలో ఐదింటిలో కాంగ్రెస్ ముందంజలో ఉండగా కోస్తా కర్ణాటకలో మాత్రం బిజెపి ముందంజలో ఉంది. ముంబయి కర్ణాటకలో కాంగ్రెస్ బిజెపిపై స్వల్ప ఆధిక్యత కనబరుస్తోంది. ఓల్డ్ మైసూర్‌లో కాంగ్రెస్ జెడి(ఎస్) పై స్వల్ప ఆధిక్యత కనబరుస్తోంది. బిజెపికి మరొకసారి అవకాశం ఇస్తారా అని అడగ్గా 53 శాతం ఇచ్చేది లేదని, 41 శాతం ఇస్తామని, 6 శాతం ఏమీ చెప్పలేమని సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టో, రాహుల్ జోడోయాత్ర కొంతవరకు ప్రభావం చూపాయి. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి, పట్టణ ప్రాంతాలలో మంచినీటి సమస్య తదితర అంశాలపై అధికార బిజెపి పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రధానంగా గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదల ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపింది. పాత పెన్షన్ పథకం అమలు చేయకపోవడంతో బిజెపిపై ప్రభుత్వ ఉద్యోగులు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వంలోని అవినీతిని ఎండగడుతూ చేసిన '40% కమిషన్ సర్కారు' నినాదం ప్రజల్లోకి బాగా వెళ్లింది. బిజెపి లేవనెత్తిన జై బజరంగ్‌బలి, టిప్పు సుల్తాన్, ఈద్గా మైదాన్ వంటి వివాదాస్పద అంశాలు ప్రజలపై ప్రభావం చూపలేకపోయాయి ముస్లిం రిజర్వేషన్ల ఎత్తివేత వల్ల ముస్లింలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు.

ఎగ్జిట్ పోల్స్

	బిజెపి	కాంగ్రెస్	జెడిఎస్	ఇతరులు
యాక్సిస్ మై మీడియా	62-80	122-140	22-25	0-3
సి ఓటర్	83-95	100-112	21-29	2-6
మాట్రిజ్	79-94	103-118	25-33	2-5
సిజిఎస్	114	86	21	3
పోల్‌స్టర్	88-98	99-109	21-26	0-4
జన్ కీ బాత్	94-117	91-106	14-24	0-2
ఇటిజి	78-92	106-120	20-26	2-4
పీపుల్స్ పల్స్	78-90	107-119	23-29	1-3
సిఎన్ఎక్స్	80-90	110-120	20-24	1-3
సగటు	90	109	24	2



పోలింగ్ ప్రశాంతం

- 72.22 శాతం పోలింగ్
- చెదురుమదురుగా ఘర్షణలు, హింసాత్మక ఘటనలు

7

రాష్ట్రంలోని 56 అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపట్టినట్లు పీపుల్స్ సర్వే పేర్కొంది.

రిపబ్లిక్ టివి, సి న్యూస్ మ్యాట్రిక్స్, న్యూస్ 24-టుడేస్ చాణక్య, టివి9 భరతవర్ష, జీన్యూస్-మార్జిట్, టైమ్స్ నౌ- ఇటిజి తదితర ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు మెజారిటీ స్థానాలు వస్తాయని, జెడిఎస్ కింగ్ మేకర్‌గా ఉంటుందని పేర్కొన్నాయి. బిజెపి పూర్తి మెజారిటీ వచ్చే అవకాశముందని సువర్ణ జంకీబాత్, న్యూస్ నేషన్ : సిజిసి సర్వే మాత్రమే పేర్కొన్నాయి.



కెఆర్ఎంబి సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ శివనందన్ కుమార్

'కృష్ణా' నీటి వాటా తేల్చలేం

- కేంద్ర జలశక్తి శాఖకు నివేదిస్తాం
- తెలుగు రాష్ట్రాలకు తేల్చి చెప్పిన కెఆర్ఎంబి
- వాడీవేడీగా బోర్డు సమావేశం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కృష్ణా నది జలాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీటి వాటాలను తాము తేల్చలేమని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) రెండు రాష్ట్రాలకు తేల్చి చెప్పింది. నీటి వాటాలకు సంబంధించి కేంద్ర జలశక్తి శాఖకు నివేదిస్తామని స్పష్టం చేసింది. జల విద్యుదుత్పత్తి, రూల్ కర్వ్, వరద సమయంలో నీటి లెక్కలకు సంబంధించి జలాశయాల నిర్వహణ కమిటీని సమావేశపరచాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని జలసౌధలో బుధవారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 17వ సమావేశం కెఆర్ఎంబి ఛైర్మన్ శివనందన్ కుమార్ అధ్యక్షతన జరిగింది. తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఇఎన్‌సి సి.మురళీధర్, ఎపి జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇఎన్‌సి నారాయణరెడ్డి, రెండు రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. బోర్డుకు సంబంధించి బడ్జెట్, ఉద్యోగులు, సిబ్బందికి జీతభత్యాలు, ఆడిటింగ్ సంబంధిత అంశాలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి వినియోగాన్ని 20 శాతంగానే పరిగణనలోకి తీసుకోవాలన్న తెలంగాణ వాదనపై సాంకేతికంగా అధ్యయనం చేయించాలని బోర్డు నిర్ణయించింది. ఆర్‌డిఎస్ ఆధునికీకరణపై సెంట్రల్ వాటర్, పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యుపిఆర్ఎస్) ద్వారా అధ్యయనాన్ని మూడు నెలల్లోపు పూర్తి చేసి, వచ్చే సీజన్‌లో మరమ్మతులు చేయాలని తీర్మానించారు. అత్యవసర మరమ్మతులుంటే తక్షణమే చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

కృష్ణా జలాల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు వాటా అంశంపై వాడీవేడిగా చర్చ జరిగింది. కృష్ణా జలాల వినియోగంలో గత తొమ్మిదేళ్లుగా అమలవుతున్న 66:34 నిష్పత్తిని మున్ముందు కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ కోరింది. గతంలో అన్ని ఆలోచించే ఆ ప్రాతిపాదిక నిర్ణయించారని ఎపి అధికారులు తెలిపారు. కేటాయింపులు మార్చే అధికారం ట్రిబ్యునల్‌కు తప్ప, మరెవరికీ లేదని ఎపి స్పష్టం చేసింది. ప్రస్తుతం అమలవుతున్న వాటా తమకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సిందేనని తెలంగాణ పట్టుబట్టింది. ప్రస్తుతం ఎస్ఎల్‌బిసితో కలిపి 105 టిఎంసిలు వస్తుందని, మొత్తంగా తమకు 811 టిఎంసిల్లో సగం వాటా కావాల్సిందేనని డిమాండ్ చేసింది. సమావేశంలో ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్య నిర్ణయానికి ఆస్కారం లేకపోవడంతో బోర్డు చేతులెత్తేసింది. ఎప్పటికప్పుడు అవసరాలను బట్టి త్రిసభ్య కమిటీ సూచనల మేరకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని, నీటి వాటా తేల్చే విషయాన్ని కేంద్ర జలశక్తి శాఖకు నివేదించాలని కెఆర్ఎంబి నిర్ణయించింది. సమావేశానంతరం ఎపి జలవనరుల శాఖ ముఖ్య

మిగతా 2లో




8 రోజుల కస్టడీకి ఇమ్రాన్

- తోషఖానా అవినీతి కేసులో దోషిగా నిర్ధారణ
- దేశవ్యాప్తంగా పిటిఐ కార్యకర్తల నిరసలు

సంక్షిప్తంగా... లోపలి పేజీల్లో

స్వలింగ వివాహాలను వ్యతిరేకించిన ఎపి

- 7 రాష్ట్రాలు సమాధానం ఇచ్చాయి
- 3 రాష్ట్రాలు వ్యతిరేకించాయి
- 'సుప్రీం'కు తెలిపిన కేంద్ర ప్రభుత్వం



18 వరకూ భానుడి భగభగ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఈ నెల 18 వరకూ ఇవి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమ గాలుల ప్రభావం, గాలిలో తేమ శాతం తగ్గడం వల్ల ఎండలు పెరగనున్నాయి. బుధవారం విజయవాడలో 39 డిగ్రీలకు చేరగా విశాఖలో 37.5 డిగ్రీలు నమోదైంది.

40 డిగ్రీలను తాకకపోయినా ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. గడిచిన రెండు రోజులుగా రాష్ట్రంలో పలు పట్టణాలు, నగరాల్లో ఎండలు 40 డిగ్రీలు దాటకపోయినప్పటికీ అంతటి తీవ్రత చూపినట్లు అనిపిస్తుందని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం వేగంగా కదులుతూ ఈ నెల 11 నాటికి తీవ్ర తుపానుగా ఆగ్నేయ బంగాళాఖాతంలో బలపడనుంది. ఆ తర్వాత ఇది క్రమంగా ఉత్తర ఈశాన్య దిశగా మే 13 నుంచి కొద్దిగా బలహీనపడి ఉత్తర మయన్మార్, బంగ్లాదేశ్ క్యుక్ప్యు (మయన్మార్) మధ్య మే 14వ తేదీ నాటికి గంటకి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ నైరుతి దిశగా వంగి ప్రయాణించనున్నట్లు వాతావరణ శాఖ విశ్లేషణ చేస్తోంది.

అది కార్పొరేట్ కాల్ సెంటర్

- ఈ నాలుగేళ్లలో ఎన్ని సమస్యలకు పరిష్కారం చూపారో చెప్పాలి
- ఆర్‌బికెలను రైతు దివాళా కేంద్రాలుగా మార్చొద్దు
- ప్రభుత్వ అండతో మిల్లర్లు రైతులను ముంచుతున్నారు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'జగనన్నకు చెబుదాం' అంటూ ఇప్పుడు ఆర్భాటంగా ప్రారంభించినా.. ఇప్పటి వరకు జగనన్నకు చెప్పుకున్న సమస్యలను ఎన్నింటిని పరిష్కరించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ప్రశ్నించారు. నాలుగేళ్ల నుంచి నిర్వహిస్తున్న స్పందనలో ఏ ఒక్క సమస్యకూ పరిష్కారం చూపడం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ కాల్ సెంటర్ తరహాలో ఆపరేటర్ ఎత్తి రెస్పాండ్ అయ్యే కార్యక్రమానికి జగనన్నకు చెబుదామని బిల్డప్ ఎందుకని ప్రశ్నించారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ నాలుగేళ్లలో ప్రభుత్వానికి ఎన్నో సమస్యలను నివేదించినా ఏ ఒక్కదానికీ ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదని అన్నారు. ఇటీవల కాలంలో ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యకూ పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. రైతు భరోసా



కేంద్రాలు కాస్తా రైతు దివాళా కేంద్రాలుగా మారాయని తెలిపారు. మిల్లర్ల దయా దాక్షిణ్యాలపై వదిలేశారు తప్ప రైతులకు ఎక్కడా న్యాయం జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో తీసుకున్న ప్రమాణాలు మిల్లర్ల వద్దకు పోగానే మారిపోయి తేమ, నూక, తాలు పేరుతో బస్తాకు 7 నుంచి 12 కేజీల కోత పెడుతున్నారని అన్నారు. ఆ పేరుతో ట్రక్కుకు రైతుల నుంచి రూ.7 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పిన డ్రయ్యర్లు, క్లీనర్లు, టార్పాలిన్‌లు లేకుండా పోయాయని చెప్పారు. గోనెసంచులు సరిగ్గా ఇవ్వడం లేదని, ఇచ్చిన వాటిలో పనికి రానివి ఎక్కువని వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు చట్ట ప్రకారం రూ.400 ఇవ్వాల్సి వుండగా రూ.200కు మించి ఇవ్వడం లేదని, ఇది కూలీలకు గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. ఉపాధి కూలీలను వేధిస్తూ రెండు పూటలా పని చేయించి ఉద్యోగులకు అమలు చేస్తున్నట్లు ఫేసియల్ హాజరు తీసుకోవడం తగదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం సబ్సిడీ బియ్యంపై కోత పెట్టడంతో పేదలు గత 20 ఏళ్లలో మొదటిసారి బియ్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్కీమ్‌వర్కర్లు, అసంఘటిత రంగకార్మికులు, నిరుద్యోగులు, 1998 డిఎస్‌సి నిరుద్యోగులు, పోలవరం నిర్వాసితులు, గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఇలా అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వీరి గోడు ప్రభుత్వానికి వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. వారితో ప్రత్యక్షంగా చర్చించకుండా కాల్ సెంటర్‌లో ఆపరేటర్‌కు సమస్యలను

మిగతా 2లో

ఐటి రంగం... దిగజారుతున్న వేతనం...

- విశాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కొలువులపై నీలినీడలు...
- తగ్గుతున్న ఉద్యోగ, ఉపాధి కల్పన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో కొలువు అంటే ఒకప్పుడు పెద్ద ఫ్యాషన్. వేల సంఖ్యలో కొలువులు. భారీగా వేతనాలు పొందేవారు. అలాంటి ఐటి రంగంలో నేడు కొలువుల జోరు మందగించింది. వేల సంఖ్యలో ఉద్యోగులు తమ పాత జీతాలతోనే రోజు కూలీల మాదిరి బతుకులీడ్చాల్సి వస్తోంది. మన రాష్ట్రంలో ఐటి హబ్‌గా పిలవబడే విశాఖలో ప్రస్తుత ఐటి రంగంలో ఈ పరిస్థితులే కనిపిస్తున్నాయి. విశాఖపట్నం రుషికొండపైనే 40 కంపెనీలు ఉన్నాయి. ఇక్కడ 20 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గడచిన ఐదేళ్లలో కొత్త ఉద్యోగుల కల్పనలేదు. ఉన్నవారికి వేతనాల్లో పెరుగుదల లేదు. ఇక్కడ 70 శాతం ఉద్యోగులు పొందుతున్న జీతాలు రూ.15 వేల నుంచి రూ.25 వేలలోపే ఉంటున్నాయి. అది కూడా వారు చదివిన ఐటి కోర్సులను బట్టే ఈ జీతం లెక్కకట్టి ఇస్తున్నారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన "గ్లోబల్ సమ్మిట్ -2023లో రూ.32,944కోట్లతో 6 ఐటి, ఐటిఇఎస్ సంస్థల స్థాపనకు ప్రతిపాదనలు వచ్చినా క్షేత్రస్థాయిలో ఒక్క అదానీ డేటా సెంటర్‌కే పునాది



కాండ్యుయెంట్ సైంట్ ఐటి కంపెనీ

రాయి పడింది. మిగతా 5 ప్రతిపాదనల్లో కదలిక లేదు.

గ్లోబల్ ఎఫెక్టూ ఒక కారణమే...?

గ్లోబల్ మాంద్యం ప్రభావం ఐటి రంగంపై ఏడాదిన్నర కాలంగా ఉంది. ఆపిల్, అమెజాన్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు పలువురు ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. మైక్రోసాఫ్ట్ సంస్థ పది వేల మందిని తొలగించింది. ఈ ప్రభావం జీతాలపైనా పడి ఐటి బతుకులు దినదినగండంగా మారాయి. ఐదేళ్ల క్రితమైతే ఈ వేతనాలు రూ.8 వేల నుంచి రూ.10 వేలే. కొన్ని కంపెనీలు ఇప్పటికీ రూ.10 వేలు జీతం ఇస్తున్నాయి. 2019 తర్వాత కొంత పెరుగుదల కనిపించి 2022 తర్వాత మరలా జీతాలు పడిపోయాయి. రుషికొండపై హిల్ నెం.1లో మిరాకిల్ సాఫ్ట్‌వేర్, హిల్ నెం.2లో మౌరిటెక్, పల్సస్, పెన్నెట్, హిల్ నెం-3లో కాండ్యుయెంట్ సైంట్ వంటి ప్రసిద్ధ సంస్థలు నడుస్తున్నాయి. అత్యధిక నైపుణ్యం కలిగిన కొద్దిమందికి వీరిచ్చే అత్యధిక వేతనం రూ.50 వేల నుంచి రూ.60 వేలు మాత్రమే. ఇక్కడ కూడా పనిచేస్తున్న 70 శాతం మంది తీసుకుంటున్న వేతనాలు రూ.25 వేలు లోపే. బిగ్ ప్లేయర్ (ఐటి సంస్థ)లు అడుగుపెట్టకుండా ఐటి వేతనం రూ.లక్షకు దాటదన్నది ఐటి ప్రతినిధులు చెబుతున్నారు.

ఐటి హిల్స్...ఆక్యుపెన్సీ డల్..

విశాఖలో చెప్పుకోదగ్గ ఐటి కంపెనీలున్న ప్రాంతం రుషికొండ ఐటి హిల్స్. ఇక్కడ రెండు మిలీనియం టవర్స్ ఉన్నాయి. మొత్తంగా 18 ఫ్లోర్లకుగాను కేవలం నాలుగు ఫ్లోర్లలోనే ఐటి కంపెనీలు నడుస్తున్నాయి. 14 ఫ్లోర్స్ ఖాళీగా ఉన్నాయి. విశాఖకు 2010 సంవత్సరం తర్వాత పెద్ద ఐటి యూనిట్ (కంపెనీ) రాకపోవడంతో ఐటి ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ జరగడం లేదని ఐటి ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రతినిధులు చెబుతున్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఐటి హిల్ నెం.3లోని మిలీనియం టవర్స్ (కాండ్యుయెంట్)లో కాస్త కార్యకలాపాలు మొదలయ్యాయి. అయితే 2022లో ఇన్ఫోసిస్ సంస్థ విశాఖకు వచ్చేస్తుందని జగన్, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రచారం చేశారు. విశాఖలో ఇన్ఫోసిస్ కోసం భవనం తీసుకున్నారు. కానీ ఐటి కార్యకలాపాలు మాత్రం ప్రారంభం కాలేదు. ఇన్ఫోసిస్ వస్తే ఐదు వేల ఐటి ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ జరిగి ఉండేది. అమెజాన్ సంస్థ కార్యకలాపాల

మిగతా 2లో

కొత్త జిల్లాల్లో హెచ్‌ఆర్‌ఎ పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లోని జిల్లా కేంద్రంలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి అద్దె భత్యాన్ని (హెచ్‌ఆర్‌ఎ) 16 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన నూతన జిల్లా కేంద్రాలైన పార్వతీపురం, పాడేరు, అనకాపల్లి, అమలాపురం, భీమవరం, బాపట్ల, నరసరావుపేట, పుట్టపర్తి, రాయచోటిలో పనిచేసే వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం ఇస్తున్న 12 శాతం హెచ్‌ఆర్‌ఎను 16 శాతానికి పెంచింది. ఈ ఉత్తర్వులు జూన్ 1 నుంచి అమల్లోకి వస్తాయని జిఓలో స్పష్టం చేశారు. ఇక మీదట రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు ఒకే విధంగా 16 శాతం హెచ్‌ఆర్‌ఎను పొందనున్నారు.

పాలిసెట్ ప్రశాంతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2023 పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 1,60,329 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,43,592 (89.56 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. బాలికలు 63,201 మంది దరఖాస్తు చేసుకోగా.. 55,562 మంది, 97,128 మంది బాలురకు 88,030 మంది పరీక్షకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 560 పరీక్షా కేంద్రాలను రాష్ట్ర సాంకేతిక విద్య బోర్డు ఏర్పాటు చేసింది. విజయవాడలోని మేరిస్ స్టెల్లా కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సాంకేతిక విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సందర్శించారు. కమిషనరు సిహెచ్ నాగరాణి ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ప్రాథమిక 'కీ'ని శనివారం విడుదల చేస్తామని నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుది 'కీ'ని సోమ, మంగళవారాల్లో ఒవ్మ్ఖుజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

చంద్రబాబు 'రైతు పోరుబాట' పాదయాత్ర

- **ఈ నెల 12న తణుకులో సభ**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'రైతు పోరుబాట' పేరుతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రైతులతో కలిసి ఈ నెల 12న పాదయాత్ర, సభ నిర్వహించనున్నారు. తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం నుంచి తణుకు వరకు 12 కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగనుంది. ఈ మేరకు టిడిపి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో చంద్రబాబు ఈ నెల 4, 5, 6 తేదీల్లో పర్యటించిన విషయం తెలిసిందే. వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ ప్రతిపక్షం ఇచ్చిన డెడ్‌లైన్‌పై ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా భారీ స్థాయిలో పోరుబాట కార్యక్రమం నిర్వహించనుంది. 12న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇరగవరం నుంచి తణుకు వరకు పలు గ్రామాల మీదగా యాత్ర సాగనుంది.

చంద్రబాబును కలిసిన గన్నవరం టిడిపి నేతలు

చంద్రబాబును గన్నవరం టిడిపి కార్యకర్తలు, నేతలు కలిశారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై ఫిబ్రవరి 20న దాడి ఘటనను చంద్రబాబుకు ఉండవల్లిలోని నివాసంలో వివరించారు. కార్యాలయంలో ఉన్న కార్లు, ఇతర వాహనాలను తగులబెట్టారని, కార్యకర్తలపై దాడులు చేశారని వివరించారు. బాధితులైన తమపై పోలీసులు కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేశారని తెలిపారు. అక్రమ కేసుల విషయంలో పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు వారికి ధైర్యం చెప్పారు.

దళిత వరుడిపై పెత్తందార్ల దాష్టీకం

మీరట్ : ఆగ్రాలో ఓ దళిత వరుడిపై పెత్తందార్లు దాడి చేసి తీవ్రంగా హింసించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుడు, మరి కొందరు కలిసి వివాహానికి ఊరేగింపుగా వెళుతుండగా ఈ నెల 4వ తేదీ రాత్రి అగ్రవర్ణాల వారు అటకాయించారు. వాహనం నుండి కిందికి లాగి చిత్రహింసలు పెట్టారు. పెళ్లికి వచ్చిన అతిథులు ప్రాణభయంతో వివాహం జరగాల్సిన హాలులోకి పరుగులు తీశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... పెత్తందారి కులాలకు చెందిన వారు కర్రలు, ఇనుప రాడ్లు పట్టుకొని యువకుడిని, అతనితో ఉన్న వారిని వెంబడించారు. వారిపై దాడికి తెగబడ్డారు. వేదిక వద్ద ఉన్న మహిళలను వేధించారు. పెళ్లి మండపం వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేసి కులం పేరుతో దూషించడం ప్రారంభించారు. పెళ్లి వేడుకకు ఆటంకం కలిగించారు.

ఈ ఘటనపై వరుడి అత్త గీతా జాతవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు కాబోయే అల్లుడు అజయ్ జాతవ్, మరికొందరు ఊరేగింపుగా సోహల్లా బస్తీ మీదుగా వెళుతుండగా 20-25 మంది వారిని అటకాయించారని, ఆగిపొమ్మని హెచ్చరించారని ఆమె తన ఫిర్యాదులో తెలిపారు. 'మా గ్రామంలో పెళ్లి చేసుకునే దళిత యువకులు ఊరేగింపుగా వెళ్లకూడదు. అలా వెళ్లేందుకు వారికి ఎంత ధైర్యం ?' అంటూ దూషించారని వాపోయారు. ఈ నెల 5న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించామని, కానీ వారు తీసుకోలేదని చెప్పారు. ఆగ్రా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు 8న ఫిర్యాదును స్వీకరించారని అన్నారు. తన కుమార్తె అంజన వివాహాన్ని అడ్డుకున్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వివిధ సెక్షన్ల కింద 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు సహా 25 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

నిబంధనలతో పరిహారానికి కొర్రీ

- **నీట మునిగితేనే పరిహారం**
- **ఉమ్మడి తూ.గోలో ప్రారంభమైన పంట నష్టాల గణన**



కాకినాడ రూరల్ అచ్చంపేట వద్ద తడిసిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టిన దశ్యం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్రప్రభుత్వం అనేక నిబంధనలతో కొర్రీ పెడుతోంది.వర్షాలకు వరి పంట కోయకుండా ఉండి నీటిలో తడిచి పాడైపోయిన, మొలకెత్తిన వరి పంటకే పరిహారం వర్తించేలా నిబంధనలు విధించింది. అది కూడా ఎకరాకు రూ.ఆరువేలు మాత్రమే పరిహారం అందించనున్నారు. పనలపై దెబ్బతిన్న పంటలకు, కళ్లాల్లో ఉంచిన ధాన్యం రాశులకు నష్టం వాటిల్లినా వాటిని పరిగణలోకి తీసుకోకపోవడంతో రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఎన్యూమరేషన్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. గ్రామ స్థాయిలో విఆర్ఒ, సర్పంచ్, వ్యవసాయ సహాయకుడు, ఒక రైతు, మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారి, తహశీల్దార్, ఎంపిడిఒలతో కమిటీలుగా ఏర్పడి పంట నష్టాలను అంచనా వేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో ఈ రబీ సీజన్‌లో 1.63 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు పంటలను ముంచెత్తాయి. అప్పటికే 76 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 9,200 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1.72 లక్షల ఎకరాల్లో రబీ సాగవ్వగా వర్షాల సమయానికి 77,422 ఎకరాల్లో కోతలు పూర్తి అయ్యాయి. తొమ్మిది మండలాల్లో 104 గ్రామాల్లో 2,300 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అంచనా వేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 1.37 లక్షల ఎకరాల్లో సాగవ్వగా వర్షాల సమయానికి సుమారు 95 వేల ఎకరాల్లో కోతలు పూర్తి చేశారు.18 మండలాల పరిధిలో 62 గ్రామాల్లో 2840 ఎకరాల్లో కోయకుండా ఉన్న వరి నీట మునిగినట్లు అంచనా వేశారు.

నిబంధనల కొర్రీ

పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. ఎకరాకు రూ.35 నుంచి రూ.40 వేలు పెట్టుబడి ఖర్చులు అవుతుంటే ఎకరాకు రూ.ఆరు వేలు మాత్రమే పరిహారం ఇవ్వనున్నారు. వర్షాలకు వరి పంట కోయకుండా ఉండి నీటిలో తడిచి పాడైపోయిన, మొలకెత్తిన వరి పంటలకే పరిహారం వర్తించేలా నిబంధన పెట్టారు. 33 శాతంపైన పంట నష్టం జరిగితేనే పరిహారం ఇవ్వనున్నారు. పనలపై పాడైన పంటకు, కళ్లాల్లో ఉంచిన ధాన్యం రాశులకు నష్టం వాటిల్లినా వాటిని పరిగణలోకి తీసుకోవడం లేదు.

కాకినాడ జిల్లాలో సుమారు ఆరు వేల ఎకరాల్లో పనలపై ఉన్న పంటకు నష్టం వాటిల్లింది. సుమారు ఏడు వేల ఎకరాల్లో 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులు తడిసి మొలకలు వచ్చాయి. కోనసీమ జిల్లాలో 563 ఎకరాల్లో పనులపై పంటకు, రాశులుగా ఉన్న 26 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి నష్టం జరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో 625 ఎకరాల్లో పనలపై ఉండగా రాశులుగా ఉన్న 9,167 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వీరిలో అనేకమంది రైతులు వర్షాల వలన నష్టపోయి తక్కువ ధరకు బయట మార్కెట్‌లో ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. 75 కిలోల బస్తాపై రూ.200 నుంచి రూ.300 వరకూ కోల్పోయారు. ఎకరాకు 50 బస్తాలు దిగుబడి వస్తే రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకూ రైతులు నష్టపోయారు.

నష్టపోయిన రైతులందర్నీ ఆదుకోవాలి



సామర్లకోట-పిఠాపురం రోడ్డులోని దేవుని మాన్యం భూమి 15 ఎకరాలు సాగు చేశాను. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని 10 రోజులు ఆరబెట్టాను. బస్తాకు ఎనిమిది కేజీల చొప్పున తరుగు తీసుకున్నారు. తేమ, నూక శాతం పేరుతో ఒక్కో బస్తాకు రూ.170 కోల్పోయాను. మొత్తం 270 బస్తాలకు రూ.45,900 కోత విధించారు. నష్టపోయిన వారందరికీ నిబంధనలు సడలించి పరిహారం ఇవ్వాలి.

- చెల్లుబోయిన పవన్ కుమార్, కౌలు రైతు, సామర్లకోట

మెడికల్ రీయింబర్స్‌మెంటు గడువు పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెడికల్ రీయింబర్స్‌మెంటు సదుపాయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే 2024 మార్చి 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 341ని బుధవారం విడుదల చేసింది. వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు అమలు చేస్తున్న మెడికల్ రీయింబర్స్‌మెంటు సౌకర్యాన్ని 2022 ఆగస్టు 1 నుంచి 2023 మార్చి 31 వరకు ప్రభుత్వం గతంలో పొడిగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇహెచ్‌ఎస్‌లో అమలులో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించేందుకు ఈ మెడికల్ రీయింబర్స్‌మెంటు గడువు పెంపు దోహదపడుతుంది. ఇందుకు సంబంధించి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒను ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది.

తెలంగాణ పది ఫలితాల్లో బాలికల హవా

- **ఫలితాలను విడుదల చేసిన మంత్రి సబితా**



ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో బాలికలు హవా కొనసాగించారు. ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడి బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) ప్రాంగణంలో విడుదల చేశారు. మొత్తం 86.60 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలికలు 88.53 శాతం, బాలురు 84.68 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి పరీక్షకు బాలురు 2,43,186 మంది హాజరు కాగా 2,05,930 మంది పాసయ్యారు. 2,41,184మంది బాలికలు హాజరుకాగా 2,13,530 మంది పాసయ్యారు. 99 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, 59.46 శాతంతో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. ఫలితాల్లో టిఎస్ రెసిడెన్షియల్స్ స్కూల్స్ 98.25 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచాయి. జూన్ 14 నుంచి 22వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 26లోపు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజును విద్యార్థులు చెల్లించాలని మంత్రి తెలిపారు.

డిఎస్‌సి-1998 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు

- **ధర్నాలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్**
- **మద్దతు తెలిపిన సిఐటియు**



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-1998లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తూ అర్హులైన వారందరికీ ఉద్యోగాలివ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. డిఎస్‌సి-1998లో సర్టిఫికెట్ల పరిశీలన చేసినవారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని, రిజర్వేషన్లు పాటించాలని కోరుతూ విజయవాడలోని ధర్నా చౌక్‌లో బుధవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. డిఎస్‌సి-1998 పోస్టుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యాన మూడు రోజులపాటు జరగనున్న ఈ దీక్షలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 1998 డిఎస్‌సిలో క్వాలిఫై అయిన నిరుద్యోగులు 25 ఏళ్లుగా పోరాడుతున్నా.. వారికి న్యాయం జరగడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి కొంతమందికి మాత్రమే ఇచ్చారని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించకుండా పోస్టులను ఇవ్వడం సరైందికాదన్నారు. 5,887 మందికి ఉద్యోగావకాశం కల్పిస్తామని 6,852 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసి, 4,072 మందికి మాత్రమే పోస్టింగులు ఇచ్చారని అన్నారు. పోస్టింగ్ ఇచ్చిన 4,072 పోస్టుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు రిజర్వేషన్‌లను పాటించకుండా ఇవ్వడం తగదన్నారు. ఈ దీక్షలకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, యుటిఎఫ్ నాయకులు హనుమంతరావు, డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కె వినయ్ కుమార్ మద్దతు తెలిపారు. దీక్షా శిబిరంలో కమిటీ రాష్ట్ర కన్వీనరు బైరవకోన శ్రీనివాసరావు, పులివెందుల రమేష్, పొదిలి రమణ, గోవిందరావు, శ్రీనివాసులు, రంగస్వామి, వంక వెంకటేష్‌రావు, రజిని, సారిక, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు సంపూర్ణ మద్దతు : సిఐటియు

డిఎస్‌సి-1998లో అర్హత సాధించి వెరిఫికేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నిర్వహించే ఆందోళనలకు తమ సంపూర్ణ ఉంటుందని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఒక ప్రకటనలో వెల్లడించారు.

సంపూర్ణ, సామాజిక న్యాయం జరిగేవరకు అభ్యర్థులు ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు. నియామకాల్లో రోస్టర్ విధానాన్ని పాటించలేదని, ఇది సరైంది కాదని విమర్శించారు. 9 ఉమ్మడి జిల్లాల్లో వెరిఫికేషన్ పూర్తిచేసుకున్న 2,682 మందికి నియామకాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్య పరిష్కారం అయ్యేదాకా అభ్యర్థులు చేపట్టే ఆందోళనలకు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.

మేజర్ సబ్జెక్టు ఒక్కటే

- **డిగ్రీలో కొత్త విధానం**
- **2023-24 నుంచి అమలు**
- **ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా డిగ్రీ కోర్సుల్లో కొత్త విధానాన్ని ప్రవేశపెడుతున్నామని ఎపి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి వెల్లడించారు. ఉన్నత విద్యామండలి కార్యాలయం మంగళగిరిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిగ్రీలో ఉన్న మూడు ప్రధాన సబ్జెక్టుల స్థానంలో ఒక్క సబ్జెక్టునే తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఒక ప్రధాన సబ్జెక్టుతోపాటు మరో మైనర్ సబ్జెక్టును విద్యార్థి ఎంచుకోవచ్చునని తెలిపారు. వీటితోపాటు రెండు బాషా సబ్జెక్టులు, స్కిల్ కోర్సు ఉంటుందని చెప్పారు. యుజిసి రూపొందించిన కరిక్యులమ్ అండ్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ (సిసిఎఫ్‌యుపి) భాగంగా ఈ విధానాన్ని తీసుకొస్తున్నామన్నారు. యుజిసి కొత్తగా నాలుగేళ్ల హానర్ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉన్నత విద్యామండలి మాత్రం మూడేళ్ల క్రితమే ఈ విధానాన్ని అమలు చేసిందని, ఆగస్టులో హానర్ డిగ్రీ నాలుగవ ఏడాది ప్రారంభం కానుందని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు కానుందని తెలిపారు. ఈ కొత్త విధానాన్ని అన్ని కళాశాలలు అమలు చేయాల్సిందేనని చెప్పారు. మూడేళ్ల నుంచి కనీసం 30 శాతం అడ్మిషన్లు పొందిన కళాశాలలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఒక సబ్జెక్టును పిజిలో విద్యార్థి ఎంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ విధానంలో సైన్స్ సబ్జెక్టుతోపాటు మైనర్‌గా ఆర్ట్స్ సబ్జెక్టు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. రీసెర్చ్ హానర్ డిగ్రీ విధానం ఉందని తెలిపారు. ఇందులో 75 శాతం మార్కులు పొందిన విద్యార్థి నేరుగా పిహెచ్‌డిలో అడ్మిషన్ పొందవచ్చునని వెల్లడించారు. కొత్త విధానానికి సంబంధించిన విధివిధానాలు, మార్గదర్శకాలను యూనివర్సిటీలకు పంపామన్నారు. కొత్త విధానానికి తగ్గట్టుగా సిలబస్‌ను కూడా రూపొందిస్తున్నామని చెప్పారు. అకడమిక్ విభాగం బలోపేతానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కొత్త విధానంపై జూన్ మొదటి వారంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జూన్ రెండో వారం నుంచి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. 1.20 లక్షల మంది విద్యార్థులు డిగ్రీలో ఇంటర్న్‌షిప్ మొదలుపెట్టినట్లు చెప్పారు. ద్రవిడ యూనివర్సిటీ జారీ చేసిన సుమారు 6 వేల పిహెచ్‌డి సర్టిఫికెట్లను రద్దు చేశామన్నారు. వైస్ ఛైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. కొత్త కోర్సుకు అనుగుణంగా అన్ని సౌకర్యాలున్న కళాశాలలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్, సెట్ల ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'కృష్ణా' నీటి వాటా తేల్చలేం

మొదటి పేజి తరువాయి

కార్యదర్శి శశిభూషణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా జలాల్లో 66:34 నిష్పత్తి కొనసాగాలని కోరామన్నారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ప్రకారమే ఈ నిష్పత్తిలో కేటాయింపులు చేశారని చెప్పారు. తెలంగాణ విజ్ఞప్తి మేరకు నీటి వాటాల అంశాన్ని కేంద్ర జలసంఘానికి నివేదించాలని నిర్ణయించారు. ఆర్‌డిఎస్ ఆధునీకరణపై అధ్యయనం కొనసాగుతుందని తెలిపారు. నీటి వాటాలు తేల్చాల్సింది ట్రిబ్యునల్ మాత్రమేనన్నారు. శ్రీశైలం నుంచి ఎపి 34 టిఎంసిలు మాత్రమే తీసుకోవాలన్న వాదన సరికాదని పేర్కొన్నారు. ఎపికి ఉన్న 512 టిఎంసిల నీటిని తాము ఎక్కడైనా ఉపయోగించుకుంటామన్నారు. విద్యుదుత్పత్తి కంటే సాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కృష్ణా బోర్డును విశాఖకు త్వరలో తరలిస్తామని బోర్డు అధికారులు చెప్పారని తెలిపారు.

తెలంగాణ నీటిపారుదల

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ మాట్లాడుతూ, కృష్ణా జలాల్లో తెలంగాణ, ఎపి వాటా తేల్చే అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖకు నివేదించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. శ్రీశైలం నుంచి ఎపి 34 టిఎంసిలు మాత్రమే తీసుకునేలా ఆదేశిస్తే జలవిద్యుదుత్పత్తి అంశంపై మాట్లాడతామని చెప్పారు. సుంకిశాల ఇన్ టేక్ వెల్‌పై , పాలమూరు - రంగారెడ్డి కేటాయింపులపై ఎపి అభ్యంతరాలు తగవన్నారు. తెలంగాణకు ఉన్న కేటాయింపుల నుంచే సుంకిశాల ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నీటిని తీసుకుంటామని చెప్పారు.

అమరావతిని అభివృద్ధి చేయండి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కసును మాని, అభివృద్ధి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమరావతిని విధ్వంసం చేయాలనే కంకణం కట్టుకున్నారన్నారు. అమరావతి జోన్-3లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా జోన్-5లో ఇవ్వడం సరైంది కాదన్నారు.



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, ఆర్ఎండి, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు

స్టీల్ ఉత్పత్తి తగ్గిస్తూ ప్లాంట్ నిర్వీర్యం

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూ, ఉత్పత్తిని తగ్గిస్తూ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 818వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, ఆర్ఎండి, కన్‌స్ట్రక్షన్ విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ వేతన ఒప్పందం జరిగి రెండేళ్లు గడుస్తున్నా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సమ్మె సందర్భంగా రెండుసార్లు ఉక్కు సిఎండి మాటిచ్చి నిలబెట్టుకోలేకపోయారన్నారు. కేంద్రం విధించిన కృత్రిమ విధ్వంసంతో ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నా కార్మికులు అంకితభావంతో పనిచేస్తున్నారని, అయినా వారి ఆర్థిక ప్రయోజనాలను యాజమాన్యం దెబ్బతీయడం దుర్మార్గమన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగమని, దీన్ని తిప్పికొడతామన్నారు. ఈ దీక్షా శిబిరంలో పి హరినాథ్, ఎస్ ప్రసాదరావు, ఎస్ శ్రీనివాస్, పివి రమణ, శ్రీనివాస్‌రెడ్డి, కర్రి సంతోష్, డి ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, జె రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర, ఎస్ రామచంద్రరావు, సిహెచ్ సన్యాసిరావు పాల్గొన్నారు.



బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

- **సంతకాలతో కూడిన నివేదిక 20న రాష్ట్రపతికి అందజేత**

ప్రజాశక్తి-విజయవాడ

రెజ్లింగ్ క్రీడాకారులను వేధించిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలనీ మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆలిండియా స్థాయిలో ఇచ్చిన పిలుపులో భాగంగా విజయవాడలో ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, పిఒడబ్ల్యు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, ఇతర ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపాయి. సింగ్‌నగర్ ఎంబి స్టేడియంలోని క్రీడాకారులు, కోర్టు భవనం సముదాయం వద్ద న్యాయవాదుల నుంచి సంతకాలు సేకరించారు. రెజ్లింగ్ క్రీడాకారులు చేస్తున్న పోరాటానికి మద్దతునిస్తూ వందలాది మంది క్రీడాకారులు, న్యాయవాదులు సంతకాలు చేసి, వారి మద్దతును తెలిపారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రభావతి, డి రమాదేవి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు దుర్గాభవాని, పిఒడబ్ల్యు గంగాభవాని, బెజవాడ బార్ అసోసియేషన్ మహిళా సెక్రటరీ పి.జయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కెబి సుందర్, జె శ్రీధర్, సీనియర్ న్యాయవాది, ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ (ఎస్ఆర్‌పి), ఇతర మహిళా న్యాయవాదులు పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, బెజవాడ బార్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ.. క్రీడాకారులను వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషన్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అతని ఎంపి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. తమకు న్యాయం చేయాలని గత కొన్ని రోజులుగా రెజ్లింగ్ క్రీడాకారులు ఢిల్లీలో ఆందోళనలు చేస్తున్నా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని ఖండించారు. సంతాల నివేదికను ఈ నెల 20న రాష్ట్రపతికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె. శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, పిఒడబ్ల్యు పద్మ, అరుణ, లలిత, పలువురు క్రీడాకారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐటి రంగం... దిగజారుతున్న వేతనం...

మొదటి పేజి తరువాయి

కోసం సిరిపురం జంక్షన్‌లో ఒక అద్దె భవనం తీసుకున్నారు. కార్యకలాపాలు జరగడం లేదు. తాజాగా అదానీ డేటా సెంటర్ కోసం (గతంలో చంద్రబాబు హయాంలోనూ శంకుస్థాపన జరిగింది) ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పునాదిరాయి వేశారు. అదానీ డేటా సెంటర్ వస్తే ఇదే పెద్ద యూనిట్ కానుంది.

భోగాపురం ఎయిర్‌పోర్టు వద్ద ఐటి సెజ్ అంతే సంగతి?

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో 2019లో భోగాపురం ఎయిర్ పోర్టు పక్కన ఐటి సెజ్ వస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. విశాఖలో ఇప్పటికే గంభీరంలో ఉన్న ఐఐఎం మాదిరిగా అభివృద్ధి చేస్తామన్నారు. అందుకోసం ఎయిర్‌పోర్టుకు కావాల్సిన 2200 ఎకరాలు కాకుండా అదనంగా 500 ఎకరాలనూ గుర్తించారు. తాజాగా ఇక్కడ ఐటి సెజ్ కాకుండా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు వినియోగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హిల్ నెం.3లోని కాండ్యుయెంట్ ఐటి యాజమాన్యం 2019-2020లలో పశ్చిమబెంగాల్, ఒడిశా, బెంగళూరు, చెన్నై నుంచి ఐటి ఉద్యోగులను తెచ్చుకుని ప్రత్యేకంగా కాండ్యుయెంట్ బస్సులు వేసి పనిచేయించింది. స్థానికంగా కొంతమంది ఐటి కంపెనీల ప్రతినిధులు కాండ్యుయెంట్‌పై తిరగబడ్డారు. ఎందుకంటే ఐటి ఉద్యోగులుగా వీరిని తీసుకుంటే రూ.8 వేలు జీతనం ఇస్తారు. కాండ్యుయెంట్ రూ.30 వేల వరకూ ఇచ్చేవారు... ఇప్పుడు రూ.60 వేల వరకు వేతనాలు కాండ్యుయెంట్ కొద్ది మందికి ఇస్తోంది.

తప్పనిసరై చేస్తున్నాం...

పలువురు ఐటి ఉద్యోగులను ప్రజాశక్తి బుధవారం పలుకరించి జీతాల గురించి మాట్లాడగా పెరగని జీతాలతో అత్యధిక మంది కూలీలుగా ఉన్నామంటూ కాండ్యుయెంట్ ఐటి వద్ద వాపోయారు. ఇదే కొనసాగితే ఏ పనీ చేయలేక, దీంట్లో కొనసాగలేక అవస్థలు పడాల్సి ఉంటుందని తెలిపారు. తప్పనిసరై చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అది కార్పొరేట్ కాల్ సెంటర్

మొదటి పేజి తరువాయి

చెప్పుకోవాలనడం ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహించారు. 1902 కాల్‌సెంటర్, టెక్నిక్‌లు, మాయలతో సమస్యలు పరిష్కారం కావని, నాలుగేళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆయా తరగతుల ప్రతినిధులతో నేరుగా ముఖ్యమంత్రి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అకాల వర్షాలకు అపార నష్టం..

రాష్ట్రంలో ఇటీవల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రధానంగా గోదావరి, కృష్ణా జిల్లాల్లో అకాల వర్షాలకు ఎక్కువగా నష్టపోయారని అన్నారు. పంటనష్టంపై ప్రభుత్వం చెబుతున్న దానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గోనె సంచులు కూడా ఇవ్వడం లేదని, కొన్ని చోట్ల అధికారపార్టీ నేతలు సూచించిన కొద్దిమందికే ఇచ్చారే తప్ప రైతులందరికీ ఎక్కడా ఇవ్వడం లేదని అన్నారు. రైతులు పండించిన ప్రతిగింజనూ కొంటామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం రకరకాల నిబంధనలు విధిస్తోందని పేర్కొన్నారు. పంట పండించేందుకు రైతులు ఇప్పటివరకు పెట్టుబడి పెడితే.. ఈ ప్రభుత్వ హయాంలో పంటను అమ్ముకునేందుకు కూడా ట్రక్కుకు రూ.7 వేల నుంచి రూ.10 వేలు పెట్టుబడి పెట్టే పరిస్థితిని తెచ్చిందన్నారు. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం (నెల్లూరు)

చాలీచాలని వేతనాలతో జీవనాన్ని కొనసాగిస్తున్న అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ జీతాలు ఇస్తామని వేతనాల పెంపు ఆందోళన సందర్భంగా మంత్రి ఉష శ్రీచరణ్ హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. నెలకు రూ.26,000 వేతనం ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసి సిబ్బందిని తగ్గించే ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఐసిడిసి ప్రాజెక్టును ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అంగన్‌వాడీలందరూ సంఘటితమై ప్రాజెక్టును కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బేగం, సుజాత, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఎంట్రన్స్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - సాలూరు (విజయనగరం)

రాష్ట్రంలోని స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర బుధవారం సాలూరులో విడుదల చేశారు. 8వ తరగతిలో ప్రవేశానికి స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 180 సీట్లకు గాను 867 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇంటర్మీడియట్ కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ప్రవేశానికి 450 సీట్లకు గాను 3,458 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ జాయింట్ సెక్రటరీ రమణమూర్తి చెప్పారు.

ఉత్తమ విద్యార్థులను అభినందించిన మంత్రి

రాష్ట్రంలోని స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఎక్కువ మార్కులు సాధించిన పది, ఇంటర్మీడియట్ విద్యార్థులను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర బుధవారం సన్మానించారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన ఆరిక చరణ్ తేజ పదోతరగతి పరీక్షల్లో 561 మార్కులు, ఇంటర్ బైపిసిలో గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన నిమ్మక వివేకానంద 957మార్కులు, ఎంపిసిలో మందస మండలానికి చెందిన సవర అనిల్ కుమార్ 944మార్కులు సాధించారు.

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి సత్యాగ్రహ పోరాటం

- భూ యజమాని సంతకం లేకుండా సిసిఆర్‌సి కార్డులివ్వాలి
- మేథాపాట్కర్



సమావేశంలో మాట్లాడుతున్న మేథాపాట్కర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలురైతులు తమ హక్కులను సాధించుకునే వరకు అహింసా పద్ధతుల్లో సత్యాగ్రహ పోరాటాల ద్వారా ఉద్యమించాలని ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక నాయకులు, సంయుక్త కిసాన్‌మోర్చా రైతు ఉద్యమ నాయకులు మేథాపాట్కర్ తెలిపారు. పంట సాగు చేస్తున్నట్లు రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చిన అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోనే సర్టిఫికెట్ ఇస్తే సరిపోతుందన్నారు. అంతేకానీ భూ యజమాని సంతకంతో లింక్ పెట్టాల్సిన అవసరం లేదన్నారు. విజయవాడ ఎంబివికెలో కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి రైతు స్వరాజ్యవేదిక ఆధ్వర్యాన పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేథాపాట్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు భరోసా పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులిస్తున్నాయని, రైతులకు కావాల్సింది పండించిన పంటకు గిట్టుబాటు ధర మాత్రమేనన్నారు. కౌలు రేట్లు బాగా పెరిగిపోయాయని, రేట్లలో ఏదో ఒకరకమైన నియంత్రణ తీసుకురావాలని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రకృతి వల్ల నష్టపోయిన సమయాల్లో నష్టపరిహారం కౌలు రైతులకు అందాలన్నారు. కార్పొరేట్లకు ఏదైనా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కౌలు రైతులకు సహాయం చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవని ఆమె విమర్శించారు. దేశ నిర్మాతలు రైతులేనన్నారు. రైతులవి ఆత్మహత్యలు కావని, అవన్నీ వ్యవస్థ చేసే హత్యలుగా పరిగణించాలని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వీటిపై రుణవిముక్తి చట్టాన్ని, కనీస మద్దతు ధరల చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ వంటి వారు బ్యాంకులకు రూ.కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్నారని, కష్టం చేసుకుని ఇక్కడ ప్రకృతి నేల మీద ఆధారపడుతున్న వారిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. 2013లో భూ సేకరణ చట్టం తీసుకువచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి కోసం ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా అటవీ భూములు సైతం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళుతున్నాయన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది కౌలు రైతులున్నారని, పంట సాగుదారుహక్కుల చట్టాన్ని సిఎం వైఎస్ జగన్ అమలు చేయలన్నారు. త్వరలో కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం సిఎంను కలుస్తామని ఆమె తెలిపారు.

అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సన్న, చిన్నకారు రైతులకు మేలు జరిగే విధంగా చట్టంలో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వాలకు రైతుల సంక్షేమం పట్టడం లేదన్నారు. ప్రభుత్వం యజమానిగా ఉండే ఆయా భూములకు సంబంధిత శాఖలో అధీకృత అధికారిగా బాధ్యతలు అప్పజెప్పాలన్నారు.

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్లకు రుణాలు రద్దు చేస్తున్న ప్రభుత్వాలు సన్న, చిన్నకారు రైతులకు సహకరించడం లేదన్నారు. రైతు స్వరాజ్యవేదిక నాయకులు విస్సా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12 ఉమ్మడి జిల్లాల్లో 4,154 మందిని 34 గ్రామ పంచాయతీల్లో కౌలు రైతుల పరిస్థితిపై సర్వే చేసి, సమస్యలపై అధ్యయనం చేశామన్నారు. కౌలు రైతుల్లో కేవలం 8.8 శాతం మందికి మాత్రమే పంట సాగుదారుల హక్కుల కార్డు (సిసిఆర్‌సి)లు లభించాయన్నారు. గతంలో 18.6 శాతం మందికి ఎల్‌ఇసి కార్డులు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మాజీ అధ్యక్షులు వై కేశవరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.


కళారూపాలు , సారె తెస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి

ఘనంగా గంగమ్మ జాతర

'సారె' సమర్పించిన ఎమ్మెల్యే భూమన

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

అంగరంగ వైభవంగా తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభమయ్యింది. ఈ నెల 16 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు భక్తులు బైరాగివేషధారణలో అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళ వాయిద్యాల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం గంగమ్మతల్లికి సారె సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు దారి పొడవునా జానపద శైలిలో కీర్తనలతో, డప్పు వాయిద్యాల నడుమ లయబద్ధంగా నృత్యం చేశారు. నవదుర్గలు, కాంతారా, తప్పెటగుళ్లు, డప్పులు, తీన్‌మార్, కీలుగుర్రాలు, కొమ్ముకొయ్య, దింపా, పగటి వేషగాళ్లు, పులివేషాలు, గరగల్లు, బోనాల కళా ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి, కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ల వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకోడేరు (పశ్చిమగోదావరి)

'జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చాం... ఏళ్లు గడుస్తున్నప్పటికీ పరిహారం మాత్రం చిల్లిగవ్వ ఇవ్వలేదు.. ఆర్థికంగా ఇబ్బందులుపడుతూ మానసికంగా కుంగిపోయాం. ఇప్పటికైనా పరిహారం చెల్లించాలి' అంటూ జగనన్న లేఅవుట్లకు భూములిచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన పాలకోడేరు కోడిగట్టు జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. దీంతో లే అవుట్‌కు భూములిచ్చిన రైతులు సర్వే పనులను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పెట్రోలు, పురుగుల మందు డబ్బాలతో రైతులు కారింకి సత్యనారాయణ, నల్లి రామలక్ష్మి, సంబలదీవి సాయి ఆందోళన చేశారు. లే అవుట్‌లోనే బైఠాయించి మండుటెండలో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎండిఒ రమణ, తహశీల్దార్ షేక్ హుస్సేన్, హౌసింగ్ ఎఇ బివి.నరసింహారావు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. న్యాయం చేసే వరకూ ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తేలేదని భీష్మించారు. రైతులకు తహశీల్దార్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అధికారులకు, రైతులకు మధ్య మరోమారు స్వల్ప వాగ్వివాదం జరిగింది. తహశీల్దార్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో రైతులు ఆందోళన కొనసాగించారు. దీంతో సర్వేకు వచ్చిన అధికారులు, తహశీల్దార్ వెనుదిరిగారు.

ముస్లిములపై దాడులు అరికట్టాలి

గవర్నరుకు లోకేష్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలపై దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. మైనార్టీలను మరింత వెనకబాటుతనంలోకి నెట్టేలా వైసిపి ప్రభుత్వ చర్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. ఆస్తుల కూల్చివేత, భౌతిక దాడులు ఆత్మహత్యలకు ప్రేరేపించడం, తప్పుడు కేసుల నమోదు నుంచి హత్యల వరకూ అనేక విధాల హింసకు గురవుతున్నారని తెలిపారు. మైనార్టీలపై దాడులు చేసే వారిని ప్రోత్సహించేలా వైసిపి ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు. అధికార పార్టీ ఒత్తిడితో కొంతమంది పోలీసులు నేరస్తులతో చేతులు కలిపి కేసులు నీరుగార్చుతున్నారని తెలిపారు. మైనార్టీలపై జరిగిన 50 దాడులు తన దృష్టికి వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. వేధింపుల వల్ల నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య, పల్నాడు ప్రాంతంలో ముస్లిం మైనార్టీల ఆస్తులపై దాడులు, హత్యలు, గెంటివేతల అంశాలు, పులివెందుల సహా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలను వివరించారు. లౌకికవాదంపై జరిగే దాడుల్లో గవర్నరు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రేరేపిత చర్యలతో వైసిపి నేతలు ఆస్తులు లాక్కున్నారని విమర్శించారు. కొన్నిచోట్ల ఉద్యోగాల నుంచి కూడా తొలగించి జీవనోపాధికి గండికొట్టారని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో పలుచోట్ల టిడిపికి అండగా నిలిచారనే అక్కసుతో గ్రామ బహిష్కరణ చేశారని వివరించారు.

స్వలింగ వివాహాలను వ్యతిరేకించిన ఎపి

- 7 రాష్ట్రాలు సమాధానం ఇచ్చాయి
- 3 రాష్ట్రాలు వ్యతిరేకించాయి
- 'సుప్రీం'కు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



స్వలింగ సంపర్కుల వివాహాలను ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకించిందని అత్యున్నత న్యాయస్థానానికి కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు బుధవారం సుప్రీం కోర్టుకు కేంద్రం వివరించింది. స్వలింగ సంపర్కుల వివాహ అంశంపై ఏడు రాష్ట్రాల నుంచి సమాధానాలు అందాయని సుప్రీం కోర్టుకు తెలియజేసింది. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, అస్సాం ఈ ఆలోచనను వ్యతిరేకించగా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మణిపూర్, సిక్కిం దీనిని పరిశీలించడానికి మరింత సమయం కావాలని అడిగాయని పేర్కొంది. స్వలింగ సంపర్కుల వివాహానికి చట్టపరమైన ధ్రువీకరణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తొమ్మిదో రోజు విచారణ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు కొనసాగింది.

రాష్ట్రంలోని వివిధ మతాలకు చెందిన మత పెద్దలను సంప్రదించామని, స్వలింగ వివాహాలకు చట్టపరమైన గుర్తింపు ఇవ్వాలనే ఆలోచనను వ్యతిరేకిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. దీని ప్రకారం, ఇది స్వలింగ వివాహం, ఎల్జిబిటిక్యూఐఎం కమ్యూనిటీకి చెందిన వ్యక్తులకు వ్యతిరేకమని రాష్ట్రం తెలిపింది.

స్వలింగ వివాహాల కేసును సుప్రీంకోర్టు విచారిస్తున్నట్లు తెలియజేస్తూ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసినట్లు ఏప్రిల్ 19న కేంద్రం కోర్టుకు తెలిపింది. వివిధ మతాల వ్యక్తిగత చట్టాల పరిధిలోకి వెళ్లబోమని సుప్రీం కోర్టు ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ రాష్ట్రాలకు తెలియజేయడానికి ఈ చర్య తీసుకుంది. స్వలింగ వివాహాలకు అనుగుణంగా ప్రత్యేక వివాహ చట్టం పరిధిని విస్తృతం చేయవచ్చో లేదో పరిశీలించడానికి కోర్టు తనను తాను పరిమితం చేయాలని నిర్ణయించుకుంది. వివాహం అనే భావన అభివృద్ధి చెందిందనే వాస్తవాన్ని సజీవంగా ఉంచాలని, వివాహానికి రాజ్యాంగ రక్షణ హక్కు ఉందనే ప్రాథమిక ప్రతిపాదనను అంగీకరించాలని సుప్రీం కోర్టు పేర్కొంది.

అప్పర్ భద్రతో రాయలసీమ ఎడారి

- యువగళం సభలో లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్ణాటకలో చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారిగా మారుతుందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం నందికొట్కూరు నియోజకవర్గంలో సాగింది. కర్నూలు మండలం గార్గేయపురం నుండి ప్రారంభమైన పాదయాత్ర నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు మీదుగా నందికొట్కూరు వరకూ సాగింది.

నందికొట్కూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. రాయలసీమ నీటి ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సిఎం జగన్ అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఉన్నకాల్ సెంటర్లకే పేరుమార్చి 'జగనన్నకు చెబుదాం' అని కొత్త పేరు పెట్టారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో మొదట చెప్పాలని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని, అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని అన్నారు. తడిచిన ధాన్యం కొనాలని, ఎప్పటిలోగా కొనుగోలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గౌరు చరిత, బిసి.జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.


బహిరంగసభలో మాట్లాడుతున్న లోకేష్

రైతులను ఆదుకోవాలి

- మొలకెత్తిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్


కడియం మండలం వేమగిరిలోని ఆవ ప్రాంతంలో పాడైన పంటను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

వర్షాల కారణంగా పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో బుధవారం ఆయన పర్యటించారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలోని ఆవ ప్రాంతంలో, కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని అవిడి గ్రామంలో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కళ్లాల్లో నిలువ ఉన్న, మొలకెత్తిన, తడిసిన ధాన్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పంట నష్ట వివరాలను తెలుసుకున్నారు. అధికారులు తమ గోడు వినిపించుకోవడంలేదని, రైస్ మిల్లర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే భారీగా కోతలు విధిస్తున్నారని పలువురు రైతులు ఆయన వద్ద వాపోయారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ నష్టపోయామని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ రైతులకు జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

రైతుల పట్ల పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగు మారిన, మొలకెత్తిన ప్రతి గింజనూ మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వేమగిరి నుంచి కొత్తపేట వరకూ పవన్‌కు ఆయన అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. మధ్యమధ్యలో రైతులు తీసుకొచ్చిన మొలకెత్తిన వరి కంకులను పరిశీలించారు. ఆయన వెంట జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ట పరచండి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లేదంటే బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యకాస ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు ఈ నెల నాలుగో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు జీలుగుమిల్లి, టి.నరసాపురం, కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాల్లో పర్యటించి, ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫోటో సిస్టం, రెండు పూటలా పని విధానం తీసుకొచ్చిందని విమర్శించారు. దళిత గిరిజనులకు, మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడమే కాకుండా వ్యవసాయ కూలీల వేతనాలు పెంపుదలకు, పేదల ఆర్థికశక్తిని పెంచడానికి దోహదపడిందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఉపాధి హామీ చట్టాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిధులు పెంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, వై.నాగేంద్రం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, కార్యదర్శి డి.రమేష్, తెల్లం దుర్గారావు, సిఐటియు నాయకులు మడివి దుర్గారావు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో అంజాద్ బాషా భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి స్మృతి ఇరానీతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గౌస్ లాజం, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహ్మద్ ఇబాదుల్లా, ఎస్ ఖాదర్, ఎంపి మిథున్ రెడ్డి, షేక్ మహ్మద్ అలీ ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బాషా మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక ఎంబార్కేషన్ పాయింట్ కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారని, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేశారని తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్‌లతో పోలిస్తే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌కు వెళ్లేవారికి (హాజీలు) రూ.83,000 అధికంగా ఖర్చు అవుతున్నందున, ధర తగ్గింపు విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ధర తగ్గించని పక్షంలో ఎపి హాజీలు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి వెళ్ళే సదుపాయం కల్పించాలని కోరామని పేర్కొన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ కొత్తది కావడం వల్ల టెండర్లలో విమానయాన సంస్థలు ధర అధికంగా కోట్ చేయడంతో ఛార్జీలు పెరిగాయని కేంద్ర మంత్రి తెలిపినట్లుగా చెప్పారు. ఈ విషయమై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో మాట్లాడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. జూన్ 7 నుంచి 21 వరకు ప్రతిరోజూ 120 మంది హాజీలతో ఒక విమానం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి సౌదీ వెళ్లనుందని తెలియజేశారు. ఎపి హాజీలు ధర అధికంగా చెల్లించాల్సిన పక్షంలో ఆ వ్యయ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. హాజీలకు ట్రైనింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తామని, విడిది ఏర్పాట్లు చేసి హజ్‌కు పంపుతామని తెలిపారు.

కాగ్నిజెంట్, గూగుల్ క్లౌడ్ భాగస్వామ్య విస్తరణ

న్యూఢిల్లీ : ఎంటర్‌ప్రైజ్ క్లయింట్లకు ఎఐ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు తమ భాగస్వామాన్ని విస్తరించామని కాగ్నిజెంట్, గూగుల్ క్లౌడ్ కంపెనీలు ప్రకటించాయి. బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు సిద్ధాంతంపై పని చేస్తున్న సంస్థలకు వినూత్న పరిష్కారాలను అందించేందుకు తాము దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని పేర్కొన్నాయి. ఇందుకోసం కాగ్నిజెంట్ బెంగుళూరులో, లండన్, శాన్ ఫ్రాన్సిస్కోలలో కొత్త గూగుల్ క్లౌడ్ ఎఐ ఇన్నోవేషన్ సెంటర్‌లను ప్రారంభించినట్లు తెలిపాయి.

నూతన కాగ్నిజెంట్ గూగుల్ క్లౌడ్ ఎఐ విశ్వవిద్యాలయం 25,000 మంది కాగ్నిజెంట్ నిపుణులకు, క్లయింట్‌లకు శిక్షణనిస్తుందని వెల్లడించాయి.

ఎసిబికి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి- కంభం రూరల్ (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా కంభం సబ్ రిజిస్ట్రార్ ఎసిబి అధికారులకు చిక్కారు. ఆయనతోపాటు డాక్యుమెంట్ రైటర్‌ను కూడా ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం... కంభం మండలం కందులపురం గ్రామానికి చెందిన రైతు సాకం కృష్ణారంగారెడ్డి 205 గజాల భూమిని తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయించేందుకు డాక్యుమెంట్ రైటర్ శ్రీరామచంద్రుడు అలియాస్ రామును సంప్రదించారు. ఇందుకు ఆయన రూ.45 వేల నగదు డిమాండ్ చేశారు. ఇంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.15 వేలైనా ఇవ్వాలని తేల్చి చెప్పారు. దీంతో, 14400 యాప్ ద్వారా ఎసిబి అధికారులకు ఈ నెల ఎనిమిదిన కృష్ణా రంగారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎసిబి అధికారుల పథకం ప్రకారం డాక్యుమెంట్ రైటర్‌కు ఆయన రూ.15 వేల లంచంగా ఇచ్చారు. ఈ డబ్బులను తీసుకెళ్లి సబ్ రిజిస్ట్రార్ ఎస్.శ్రీరామ్మూర్తికి రాము ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్‌ను, డాక్యుమెంట్ రైటర్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

కేసులతో అడ్డుకోవడం తగదు

- వైసిపి ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలకు అమరావతి ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే టిడిపి, దాని అనుబంధ సంఘాలతో చంద్రబాబు సుప్రీంకోర్టులో కేసులు వేయించి అడ్డుకోవడం తగదని వైసిపి ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 50 వేల ఎకరాల్లో 50 వేల మంది పేదలు వుంటే తప్పేంటి అని ప్రశ్నించారు. చంద్రబాబు బినామీలకు రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో నష్టం వస్తుందనే పేదల ఇళ్లను అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంచి కార్యక్రమాలను తిట్టేందుకే వర్ల రామయ్యను టిడిపి ముందు పెట్టిందని అన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 20 లక్షల 5జి యూజర్లు

ఎయిర్‌టెల్ వెల్లడి

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తమ సంస్థ 20 లక్షల మంది 5జి వినియోగదారుల మైలురాయిని దాటిందని భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. దేశంలో 5జి సేవలు ప్రారంభించిన తొలి 8 నగరాల్లో హైదరాబాద్ ఒక్కటని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో 150 నగరాలు, పట్టణాల్లో 5జి సేవలను అందుబాటులోకి తెచ్చామని భారతీ ఎయిర్‌టెల్ ఎపి, తెలంగాణ సిఇఒ శివన్ భార్గవా తెలిపారు.

గో ఫస్ట్ దివాలా ప్రక్రియకు ఎన్‌సిఎల్‌టి ఆమోదం

న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్ విమానయాన సంస్థ దాఖలు చేసిన స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియ పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) స్వీకరించింది. దివాలా పరిష్కారకర్తగా అభిలాష్ లాల్‌కు కంపెనీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ జస్టిస్ రామలింగం సుధాకర్, జస్టిస్ ఎల్‌ఎన్ గుప్తా నేతృత్వంలోని ధరాస్మనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గో ఫస్ట్ దివాలా ప్రక్రియ కేసును వేగంగా విచారణ జరిపించాలన్న ఆ కంపెనీ విజ్ఞప్తి మేరకు ఎన్‌సిఎల్‌టి స్పందించినట్లయ్యింది. బోర్డు ఆఫ్ డైరెక్టర్లను సస్పెండ్ చేసింది. ఆ కంపెనీ చెల్లింపులపై మారటోరియం విధించింది.

సంపాదకీయం


సుప్రీం ధర్మాగ్రహం

ఎన్నికల వేళ కర్ణాటకలో ముస్లిం రిజర్వేషన్ల చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న బిజెపి ఎత్తుగడలను దేశ సర్వోన్నత న్యాయస్థానం నిలువరించి న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలిపింది. సుప్రీం కోర్టు విచారణలో ఉన్న అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బహిరంగంగా చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వెలిబుచ్చి రాజ్యాంగ ధర్మాన్ని కాపాడింది. రాజకీయాలు చేయడం మానుకోవాలని, వ్యవస్థలపై గౌరవ మర్యాదలు ఉంచాలని గడ్డి పెట్టింది. తరచు ఉద్రేక, విద్వేష, వివాద ప్రసంగాలు చేయడానికి పోటీలు పడుతున్న బిజెపి, పరివార ముఠాలకు 'సుప్రీం' ధర్మాగ్రహం చెంప పెట్టు వంటింది. అవినీతి, అక్రమాలు, పాలనా వైఫల్యాలతో కర్ణాటక బిజెపి ప్రభుత్వ అడుగు జారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో తన అసలు సిసలు మెజారిటీ వాద ఆయుధాన్ని బయటికి తీసింది. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనకబడ్డ ముస్లింలకు ఉద్యోగాలు, విద్యా సంస్థల ప్రవేశాల్లో ఇప్పటికే ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లను మొన్న మార్చిలో బిజెపి సర్కారు రద్దు చేసింది. రాజకీయంగా ప్రాబల్యం కలిగిన లింగాయత్, వొక్కలిగ కులాలకు చెరో రెండు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఈ చర్యను కొందరు సుప్రీంలో సవాల్ చేయగా, ప్రభుత్వ నిర్ణయ అమలును తాత్కాలికంగా సుప్రీం నిలిపివేసింది. విచారణ జరుగుతోంది.

ఒక వైపు సుప్రీంలో విచారణ జరుగుతుండగా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కర్ణాటక ఎన్నికల ప్రచారంలో మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని మెజారిటీ ఓట్ల సమీకరణ లక్ష్యంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కోర్టు విచారణలో ఉన్న అంశంపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం కోర్టు ధిక్కరణ అవుతుంది. ఈ చిన్న విషయం కేంద్ర హోం మంత్రి స్థాయి వ్యక్తికి తెలియక కాదు. ఉద్దేశపూర్వకంగానే షా ఆ విధంగా మాట్లాడారన్నది సుస్పష్టం. న్యాయస్థానాలను ప్రభావితం చేసేలా వ్యాఖ్యానించడం, బెదిరింపులకు దిగడం బిజెపి, సంఘ పరివారానికి అలవాటైన విద్యే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణి మితిమీరిపోయింది. వివాదాస్పద బాబ్రీ మసీదు- అయోధ్య తీర్పు వెలువడక ముందే అమిత్‌షా ఇలానే మాట్లాడారు. శబరిమల కేసు విషయంలోనూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తమ అధికార పత్రిక 'ఆర్గనైజర్'లో న్యాయ వ్యవస్థ పాశ్చాత్య దేశాలకు అనుకూలంగా పని చేస్తోందని తెగనాడారు. స్థానిక మెజారిటీ హిందువులకు వ్యతిరేకంగా తీర్పులు చెబుతోందని, వ్యవస్థ మారాలని హుకుం జారీ చేశారు. న్యాయ వ్యవస్థను ఈ విధంగా బ్లాక్ మెయిల్ చేసేందుకు సాహసిస్తున్నారంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అండ చూసుకునే.

కేంద్రంలో మోడీ సర్కారు వచ్చాక అన్ని వ్యవస్థల్లోకి హిందూత్వ శక్తుల చొరబాటు కొనసాగుతోంది. న్యాయ వ్యవస్థ అతిక్రమణకూ తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మోడీ కార్పొరేట్-మతోన్మాద విధానాల అమలుకు న్యాయ వ్యవస్థ చాలా సందర్భాల్లో అడ్డుగా నిలుస్తోంది. రాజ్యాంగం, చట్టాల పరిరక్షణ కర్తవ్య నిర్వహణలో భాగంగా కోర్టులు ఆ విధంగా స్పందిస్తున్నాయి. అది గిట్టని మోడీ ప్రభుత్వం న్యాయ వ్యవస్థలో రాజకీయ జోక్యానికి దారులు వెతుకుతోంది. జడ్జిల నియామకాలపై నిర్ణయం తీసుకునే కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధిని చేర్చాలంటోంది. న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటుందని సుప్రీంకోర్టు అందుకు నిరాకరిస్తోంది. ఈ మధ్య కాలంలో జడ్జిల నియామకాలపై కొలీజియం చేసిన సిఫారసులను కేంద్రం తొక్కిపట్టిన ఉదంతాలున్నాయి. తరచు న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు న్యాయస్థానాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల అధికారాలకు రాజ్యాంగం కొన్ని పరిధులు గీసింది. ఏ వ్యవస్థా ఆ గీతలను దాటరాదు. ఈ రాజ్యాంగ నిర్దేశాన్ని వ్యవస్థలు తప్పక పాటించాలి. అతిక్రమిస్తే రాజ్యాంగ సంక్షోభం ఏర్పడుతుంది. ఈ సూక్ష్మం ఎల్లవేళలా వ్యవస్థల మననంలో ఉండాలని కేశవానంద భారతి కేసు సహా పలు సందర్భాల్లో సుప్రీం నొక్కివక్కాణించింది. తాజాగా సుప్రీం వ్యక్త పరిచిన ధర్మాగ్రహంతోనైనా బిజెపి, పరివారం బుద్ధి తెచ్చుకోవాలి.

మహనీయుల మాట



సమాజంలో ఏ వర్గమైతే
భౌతిక వనరులను
అదుపు చేస్తుందో....
అదే మేథాశక్తిని కూడా
అదుపు చేస్తుంది.
-కారల్ మార్క్స్

ఎయిర్‌పోర్టు, డేటా సెంటర్లతో

ఉత్తరాంధ్ర రూపురేఖలు మారేనా !



ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు ఆదానీ డేటా సెంటర్, చింతపల్లి ఫిష్‌ల్యాండింగ్, తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టు, మూలపేట (భావనపాడు) పోర్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీటి రాకతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోతాయని ప్రకటించారు. అంతేగాక ఇటీవల విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహించామని, దీని వల్ల ఉత్తరాంధ్రకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి రానున్నదని, దీనికి తోడు విశాఖ పరిపాలనా రాజధాని కానుండడంతో అభివృద్ధిలో ఉత్తరాంధ్ర రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. అందుకోసమే వచ్చే సెప్టెంబర్ నుండే విశాఖ నుండే పరిపాలన సాగిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

ఈ మాటలు ఉత్తరాంధ్రకు కొత్తేమీ కావు..అనేక దశాబ్దాల నుండి పాలకులు అందమైన మాటలతో ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తూనే ఉన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కూడా అనేక సార్లు గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లు జరిపి ఉత్తరాంధ్రకు రంగుల స్వప్నం చూపించారు. ఎడ్యుకేషన్ హబ్, ఐటి హబ్, ఫిన్‌టెక్ సిటీ, హెల్త్ సిటీ ...ఇలా... అనేక మాటలతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి మొండి చెయ్యి చూపారు. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా ఇదే బాటలో కొనసాగుతున్నది. అయితే ఈ రెండు ప్రభుత్వాల ఉమ్మడి లక్ష్యం ఏమిటంటే అభివృద్ధి పేర ఉత్తరాంధ్రలోని భూములు, ఖనిజ సంపద, సహజ వనరులు, సముద్రతీరాన్ని బడా సంస్థలకు కట్టబెట్టటమేనని గత అనుభవం తెలియజేస్తున్నది. ఉదాహరణకు బడా కార్పోరేట్ సంస్థలైన అదానీ, జిఎంఆర్‌ల విషయంలో టిడిపి, వైసిపిలది ఒకే వైఖరి. అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు ఒకరికొకరు విమర్శించుకుంటారే తప్ప అధికారంలోకి రావడంతోటే ఈ సంస్థలకు భారీగా సంపదను దోచిపెడుతున్నారు. దీనికి అభివృద్ధి ముసుగు తొడుగుతున్నారు.



> "అనేక దశాబ్దాల నుండి పాలకులు అందమైన మాటలతో ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తూనే ఉన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కూడా అనేక సార్లు గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లు జరిపి ఉత్తరాంధ్రకు రంగుల స్వప్నం చూపించారు. ఎడ్యుకేషన్ హబ్, ఐటి హబ్, ఫిన్‌టెక్ సిటీ, హెల్త్ సిటీ ...ఇలా... అనేక మాటలతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి మొండి చెయ్యి చూపారు. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా ఇదే బాటలో కొనసాగుతున్నది. అయితే ఈ రెండు ప్రభుత్వాల ఉమ్మడి లక్ష్యం ఏమిటంటే అభివృద్ధి పేర ఉత్తరాంధ్రలోని భూములు, ఖనిజ సంపద, సహజ వనరులు, సముద్రతీరాన్ని బడా సంస్థలకు కట్టబెట్టటమేనని గత అనుభవం తెలియజేస్తున్నది. ఉదాహరణకు బడా కార్పోరేట్ సంస్థలైన అదానీ, జిఎంఆర్‌ల విషయంలో టిడిపి, వైసిపిలది ఒకే వైఖరి."

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ కథనే చూద్దాం. ఈ విమానాశ్రయం ఏర్పాటు పెద్ద అవినీతి పుట్ట. గతంలో చంద్రబాబు నాయుడు దీనిని తెరమీదికి తెచ్చారు. వాస్తవంగా 2017 మొదటి టెండర్లలోనే భారత ఎయిర్‌పోర్టు అథారిటీ (ఏఏఐ) విమానాశ్రయ నిర్మాణం, నిర్వహణను చేజిక్కించుకుంది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ఆదాయంలో 30.2 శాతం, ఎయిర్‌పోర్టులో 26 శాతం ఈక్విటీ హక్కులను రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తామని ఏఏఐ టెండర్‌లో తెలిపింది. అంతేగాక ఎకరానికి లీజు క్రింద ఏడాదికి రూ.20వేలు చొప్పున రూ.5.40 కోట్లు కూడా చెల్లిస్తామని తెలియజేసింది. ఒప్పందం ప్రకారం ఏఏఐకి భోగాపురం ఎయిర్‌పోర్టును ఇచ్చినట్లయితే మూడేళ్ల క్రితమే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభమై ఉండేది. వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేవి. ఆ ప్రాంతంలో బ్రహ్మాండమైన మౌలిక సదుపాయాలు ఏర్పడటంతో పాటు సర్వీస్‌రంగం అభివృద్ధి అయ్యేది. విమానాశ్రయం ద్వారా వచ్చే ఆదాయం ప్రజలకు పున:పంపిణీ అయ్యేది. ఆ ప్రాంతం కొంతమేరకైనా.. అభివృద్ధి అయి ఉండేది. కానీ ఏఏఐకి దక్కిన విమానాశ్రయ టెండర్‌ను చంద్రబాబు కుట్రతో రద్దు చేశారు. జిఎంఆర్‌కి దొడ్డిదారిన కట్టబెట్టి 2019 అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబు ఒప్పందాన్ని రద్దు చేయడానికి ప్రయత్నం చేసి చివరికి జిఎంఆర్‌తో రహస్య సంధి చేసుకొని నాలుగేళ్ల తరువాత గత వారం రెండోసారి శంకుస్థాపన చేశారు.

భోగాపురం విమానాశ్రయాన్ని అడ్డం పెట్టుకొని తెలుగుదేశం, వైఎస్ఆర్ సిపి గడిచిన ఎనిమిదేళ్లలో చేసిన రియల్ ఎస్టేట్ దందా అంతాయింతా కాదు. తెలుగుదేశం వారు అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ అగ్రనాయకులు వందల ఎకరాల భూమి ముందస్తుగా కొనుగోలు చేసి పెద్దఎత్తున రిసార్ట్స్, లే అవుట్‌లు వేసి వేలకోట్లు సంపాదించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత విమానాశ్రయానికి కేటాయించిన భూమిలో కొంత భాగాన్ని తగ్గించి దానిని వైసిపి అగ్ర నాయకులు రియల్ ఎస్టేట్ చేసి వేలకోట్లు సంపాదించారు. రైతులను భయపెట్టి పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారు. ఇంకా ఈ భూ దందా కొనసాగుతూనే ఉంది. చివరికి అంతర్జాతీయ విమానాశ్రయం వల్ల తీవ్రంగా నష్టపోయిందెవరంటే రైతులు, వ్యవసాయ కూలీలే.

> విస్తారమైన అటవీ గిరిజన ప్రాంతం ఉత్తరాంధ్ర మరొక ప్రత్యేకత. ఉత్తరాంధ్ర జనాభాలో 13శాతంపైనే గిరిజనులున్నారు. ఇతర తరగతులతో పోలిస్తే అన్ని విషయాల్లో బాగా వెనుకబడి ఉన్నారు. వీరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు లేకపోగా వీరి బతుకులను చిద్రం చేసే చర్యలకు పూనుకుంటున్నారు. తాజాగా అల్లూరి, మన్యం జిల్లాల గిరిజన ప్రాంతాల్లో, అనకాపల్లి జిల్లాలో గ్రీన్ విద్యుత్ పేర అదానీకి వేలాది ఎకరాలు ధారదత్తం చేశారు. మైనింగ్‌కి మరల కుట్రలు పన్నుతున్నారు. అటవీ హక్కుల చట్టాలన్నింటినీ నీరుగార్చేస్తున్నారు.

తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు వ్యవహారం చూద్దాం. ఈ నీటి ప్రాజెక్టును డిసెంబర్ 2024 నాటికి పూర్తి చేస్తామని, దీని ద్వారా విజయనగరం జిల్లా పూసపాటి రేగ, భోగాపురం, డెంకాడ మండలాల్లో 49 గ్రామాల ప్రజలకు తాగునీరు, 24710 ఎకరాలకు సాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి ఘనంగా చెప్పారు. దశాబ్దాల నుండి ఈ నీటి ప్రాజెక్టును మూలనపడేశారు. ఇప్పుడు ఆఘమేఘాల మీద రూ.94 కోట్లు కేటాయించి ప్రజల కోసమే తమ ప్రభుత్వం ఉందని గొప్పలు చెబుతున్నారు. అసలు ఉద్దేశ్యం ఏమిటీ? భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మంచినీరు అవసరం. అంతేగాక విమానాశ్రయం అంతర్ భాగంగా 500 ఎకరాల్లో ప్రైవేట్ స్టార్ హోటల్స్, షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్సులు వంటివి అనేకమైనవి నిర్మాణం కాబోతున్నాయి. వీటికి తోడు వైసిపి, టిడిపి అగ్రనాయకుల ఆధ్వర్యంలో ఉన్న వేల ఎకరాల రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు, రిసార్ట్స్‌కు, భారీ వ్యాపార, వాణిజ్య , రిక్రియేషన్ కార్యకాలాపాలకు మంచినీరు అవసరం. అందుకోసమే ముఖ్యమంత్రికి ఈ ప్రాజెక్టు మీద ఇంత ప్రేమ కలిగింది.

ఇక నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అనేక దశాబ్దాల నుండి ఉత్తరాంధ్ర తీవ్ర వివక్షతకు గురౌతూనే వున్నది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఈ నాలుగేళ్లలో ఒక చిన్న నీటి ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదు. 2019-2022 మధ్య ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన 9 నీటి ప్రాజెక్టులకు కేవలం రూ.543 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. 2023-2024 బడ్జెట్‌లో రూ.394 కోట్లు కేటాయించారు. ఇందులో నాలుగోవంతు కూడా ఖర్చు చేస్తారనే గ్యారంటీ లేదు. ఈ నిర్లక్ష్యం వల్లే వంశధార, తోటపల్లి బ్యారేజి, నాగవళి రివర్, జంఝావతి, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, మడ్డువలస రిజర్వాయర్ రెండోదశ, గజపతినగరం బ్రాంచి కెనాల్ వంటి అనేక నీటి ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తికాకుండా ఉన్నాయి. జలయజ్ఞంలో భాగమైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భారీ నీటి ప్రాజెక్టు నేటికీ అతిగతీలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్రలో సుమారు 8 లక్షల ఎకరాలకు నీటి సదుపాయం కలిగేది. కానీ పాలకుల దృష్టిలో నీటి ప్రాజెక్టుల కన్నా ప్రైవేటు విమానాశ్రయాలే అభివృద్ధికి చోదక శక్తులుగా ఉన్నాయి.

ఇక జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు పోటీపడి చెపుకుంటున్న ప్రాజెక్టు అదానీ డేటాసెంటర్. నిని ఆదానీ పుత్రరత్నాలతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దీని కథ కూడా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం లాంటిదే. సుమారు రూ.4500 కోట్లు విలువ గలిగిన భూమిని అదానీకి సమర్పించి ఎన్నో రాయితీలిచ్చారు. ఇంకా వందల ఎకరాల భూమి ధారదత్తం చేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. అంతేగాక శ్రీకాకుళం జిల్లాలో నిర్మాణం చేయబోతున్న మూలపేట పోర్టును కూడా అదానీకే కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనపిస్తున్నది. ఎందుకంటే విశాఖలో ఉన్న గంగపోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాను కూడా అతి తక్కువ ధరకే అదానీ పరం చేశారు. అందువల్ల భావనపాడు పోర్టు విషయంలో కూడా ఇదే వైఖరి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అలాగే విశాఖ ప్రభుత్వ రంగంలో పోర్టును కూడా కేంద్ర బిజెపి సహాయంతో కబలించటానికి ఆదానీ అనేక కుట్రలు చేస్తున్నాడు. స్థూలంగా వీరి విధానాల వల్ల మొత్తం ఆంధ్రతీర ప్రాంతం మీద ఆదానీ గుత్తాధిపత్యంలోకి వెళుతున్నట్లు స్పష్టమవుతున్నది.

విస్తారమైన అటవీ గిరిజన ప్రాంతం ఉత్తరాంధ్ర మరొక ప్రత్యేకత. ఉత్తరాంధ్ర జనాభాలో 13శాతంపైనే గిరిజనులున్నారు. ఇతర తరగతులతో పోలిస్తే అన్ని విషయాల్లో బాగా వెనుకబడి ఉన్నారు. వీరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు లేకపోగా వీరి బతుకులను చిద్రం చేసే చర్యలకు పూనుకుంటున్నారు. తాజాగా అల్లూరి, మన్యం జిల్లాల గిరిజన ప్రాంతాల్లో, అనకాపల్లి జిల్లాలో గ్రీన్ విద్యుత్ పేర అదానీకి వేలాది ఎకరాలు ధారదత్తం చేశారు. మైనింగ్‌కి మరల కుట్రలు పన్నుతున్నారు. అటవీ హక్కుల చట్టాలన్నింటినీ నీరుగార్చేస్తున్నారు.

ఉత్తరాంధ్రకు మరొక ప్రత్యేకత కూడా ఉంది. దాదాపు 375 కిలోమీటర్ల పొడవు గల సముద్రతీరం ఉంది. తీరప్రాంతాన్ని ఉపయోగించుకొని ఉత్తరాంధ్రను బ్రహ్మాండంగా అభివృద్ధి చెయ్యొచ్చు. గత కొనేళ్లుగా తీరప్రాంతం పెట్టుబడి దురాక్రమణకు గురౌతున్నది. ప్రజల ప్రయోజనాల కన్నా పెట్టుబడుదారుల లాభాలే ముఖ్యంగా తీరప్రాంతాన్ని ధ్వంసం చేస్తున్నారు. తీరప్రాంత పొడవునా లక్షలాది మత్స్యకారులున్నారు. వీరి అభివృద్ధి ఎక్కడవేసిన గొంగలి అక్కడే ఉన్నట్లుంది. ఇటీవల ముఖ్యమంత్రి విజయనగరం జిల్లాలో చింతపల్లి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చాలా గొప్పగా చెప్పుకున్నారు. 75 ఏళ్ల చరిత్రలో ఉత్తరాంధ్రలో ఒకే ఒక ఫిషింగ్ హార్బర్ ఉందంటే ఎలాంటి అభివృద్ధి జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఉత్తరాంధ్రలో నాలుగు చోట్ల ఫిషింగ్ హార్బర్‌లు నిర్మిస్తామని చెప్పారు. ఒక్కటీ నిర్మాణం చేయలేదు. ఫిష్‌ల్యాండ్‌లు కూడా ఎక్కడా కొత్తగా నిర్మాణం చేయలేదు. గంగవరం పోర్టు నిర్వాసితులకు ఫిష్‌లాండింగ్ జెట్టి నిర్మిస్తామని ఒప్పందం చేసుకొని 20ఏళ్లు దాటినా నేటికీ అతీగతీలేదు. ఇక మానవ వనరుల అభివృద్ధిలో గత ఏడు దశాబ్దాల నుండి రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలోనే ఉత్తరాంధ్ర కొనసాగుతున్నది.


ఈ వెనుకబాటు తనానికి తగిన వ్యూహం, దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలు రూపొందించకుండా, వికేంద్రీకరణ చర్యలు చేపట్టకుండా, బడ్జెట్‌లో తగిన విధంగా నిధులు కేటాయించకుండా, మానవాభివృద్ధి సూచికలు మెరుగుదల చేయకుండా నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు కల్పించకుండా ఉత్తరాంధ్ర ఎన్నటికీ అభివృద్ధి కాలేదు. అలాగే ప్రభుత్వ పెట్టుబడులు లేకుండా ప్రైవేట్ రంగంలో వచ్చే ఎయిర్‌పోర్టులు, పోర్టులు, పరిశ్రమల వల్ల ఉత్తరాంధ్రకు ఏ మాత్రం మేలు చేయకపోగా ఈ ప్రాంత ప్రజల ఆస్తిత్వాన్నే ప్రమాదంలో పడేస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

డా॥ బి.గంగారావు
9490098792

ఆదాయ భద్రత కేంద్రంగా కుటుంబ వ్యవసాయం

విశ్లేషణ





సామాజిక, ఆర్థిక సంక్షోభాలు లేని వ్యవస్థ, యుద్ధాలు, రోగాలు లేని సమాజం సాధ్యమేనని 20వ శతాబ్దపు రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి. కార్ల్ మార్క్స్-ఫెడరిక్, ఎంజెల్స్‌ల సోషలిజం తాత్వికత పేరుతో రూపొందిన సోవియట్-సోషలిస్ట్ రిపబ్లిక్ రష్యా మొదలుపెట్టిన ప్రయాణం ఎందరినో ప్రేరేపించింది. మానవ హక్కులు, ముఖ్యంగా స్త్రీ, పురుషుల సమానత్వం సాధ్యమని రష్యా 20వ శతాబ్ది మొదటి భాగంలో ప్రపంచానికి చూపెట్టింది. చైనా వంటి అనేక దేశాల్ని ప్రభావితం చేసింది. యూరప్, అమెరికా దేశాల పెట్టుబడిదారీ వ్యవస్థల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చింది. ఫలితంగా రూపొందిందే "అందరికే ఆహారాన్ని" అందించగల వ్యవసాయం. 19వ శతాబ్దపు పారిశ్రామిక విప్లవాల నేపథ్యంతో మల్చబడ్డ ఈ వ్యవసాయాన్ని "హరిత విప్లవంగా" పిలిచారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంస్కరణల్లో భాగంగా దాన్ని ప్రపంచ వ్యాపితం చేశారు.. ఆ క్రమంలో వలస దేశాల క్యూడా దాన్నీ విస్తరింపజేయడం, ఆహార కొరతను తీర్చగల సత్తా పెట్టుబడీదారీ దేశాల పారిశ్రామిక విప్లవాల వెలుగులోనే జరుగుతుందని భ్రమింపజేశారు. భారతదేశం, అలాగే అనేక ఆఫ్రికా దేశాల స్వావలంబనకు బాటలు వేసినట్లు చెప్పుకొన్నారు. వ్యవసాయ (ఆహార రంగాలకు కీలక మైన పరిశోధన, విస్తరణ కేంద్రాన్ని తమ అదుపులో నడిచేట్లుగా కొన్ని చేశాయి.. వివిధ దేశాల వ్యవసాయం హరితవిప్లవ సాంకేతికాల నేపథ్యంలోకి మారేట్లుగా అమెరికా, ఐరోపా దేశాల తమ మార్కెట్ వ్యవస్థలను మల్చుకున్నాయి. దాదాపు ఐదారు దశాబ్దాల పాటు ఈ వరవడి కొనసాగింది. అయితే 1980-85 నుండి రూపొందిన రాజకీయార్థిక మార్పులు, ముఖ్యంగా" సోవియట్ యూనియన్" విచ్ఛిన్నం చైనా ఆర్థిక తాత్వికతల మార్పు, పర్యావరణరీత్యా ముందుకొచ్చిన సంక్షోభాలు. ప్రపంచాన్ని మలుపుతిప్పాయి. హరిత విప్లవం తెచ్చిన ఉత్పత్తి పెరుగుదల ఆహారాన్ని అందరికీ అందుబాటులోకి తేలేకపోయింది. అనేక ఆసియా, ఆఫ్రికాదేశాల ప్రజలు ఆహార అవసరాన్ని అందుకోలేక పోయింది. దానికి నిదర్శనమే 'సహసాబ్ది లక్ష్యాలు రూపొందటం. వివిధ దేశాలకు ఐక్యరాజ్యసమితి కాలపరిమితి విధించి తమ దేశ ప్రజలందరికీ ఆహారం అందుబాటులోకి తేవాలని చెప్పటం, 2015 నాటికి అది సాధ్యపరచాలని హెచ్చరించింది. అయినా చాలాదేశాలు ఆ లక్ష్యాన్ని సాధించలేకపోయాయి. అందులో భారతదేశం కూడా ఒకటి. హరిత విప్లవాన్ని సాధిచి తమ ఆహార ఉత్పత్తుల్ని ఐదారు రేట్లు పెంచుకోగలిగిన భారతదేశం ఇదెందుకు సాధించలేకపోయింది. పైగా హరిత విప్లవాన్ని ఆబగా అందుకొన్న అనేక రాష్ట్రాల్లో వ్యవసాయానికి కీలకమైన రైతులు ఆత్మహత్యలు, వలసలతో "వ్యవసాయ సంక్షోభాన్ని" బయటపెట్టారు. భారతదేశ హరిత విప్లవానికి వైతాళికులుగా పేర్కొనబడ్డ అనేకమంది శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, సామాజిక ఉద్యమకారులు ఈ అంశాన్ని గత 3-4 దశాబ్దాలుగా చర్చిస్తున్నారు. అనేకమంది నిపుణులతో కమీషన్లు నడిచాయి. ఆ నేపథ్యంలో రూపొందిందే "జాతీయ రైతు కమిషన్" . దానికి నేతృత్వం వహించి ప్రొ. ఎం.ఎస్. స్వామినాథన్ దశాబ్దం క్రితమే " ఆదాయ భద్రత " కేంద్రంగా నడిచే కుటుంబ వ్యవసాయమే దానికి పరిష్కారమని సూచించారు. అయినా ప్రభుత్వాల వరవడి మారలేదు. పైగా పెట్టుబడిదారీ దేశాల నమూనాను అనుసరింపజేసే ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశ పెడుతూనే ఉన్నాయి. కుంటుతూ నడిచే కుటుంబ వ్యవసాయాన్ని కూల్చితే తప్ప ఈ సంక్షోభం తీరదని చెప్పకుండా చెప్తున్నారు. వ్యవసాయం వ్యాపారంగా మారాలని వృత్తిగా నిలబడే దశపోయిందనీ , అదే అమెరికా, ఐరోపాలు నిరూపించాయని నమ్మ బలుకుతున్నారు. ఇదెంత వరకు సమంజసం? హేతు బద్ధమైన అవగాహనా ?

సమాజాన్ని మార్చగల వ్యవసాయాభివృద్ధి

ఆ మధ్య ప్రపంచ బ్యాంక్ నిపుణుల సంఘం అప్రయత్నంగా ఒక వాస్తవాన్ని బయటపెట్టాల్సి వచ్చింది. దాని ప్రకారం ప్రసుత్త ప్రపంచ సంక్షోభ దశలో ఆకలిని, పౌష్టికాహార లోపాన్ని, దారిద్రాన్ని సహజ వనరుల పతనాన్ని, పర్యావరణ విచ్ఛేదనాన్ని, ఉగ్రవాద వరవడిని ఆపగలిగేది ఒక్క వ్యవసాయ అభివృద్ధి మాత్రమే. కారణం ప్రపంచంలో అధిక జనాభా దేశాలు ఇప్పటికీ వ్యవసాయాభివృద్ధి కేంద్రంగా నడుస్తున్నాయి. అందులో ఎక్కువ దేశాలు కుటుంబ వ్యవసాయ వృత్తి (వ్యాపారం) మీద ఆధారపడుతున్నాయి. అయితే వ్యవసాయ (ఆహార ఉత్పత్తి) అభివృద్ధి రైతు (అసలైన సాగుదారు) అభివృద్ధితో ముడిపడి ఉంది. కార్పొరేట్ సంస్థల కొమ్ముకాసే ప్రభుత్వాలు ప్రపంచ మార్కెట్ వ్యవస్థలు ఈ విషయాన్ని గుర్తించ నిరాకరిస్తున్నాయి. పైగా ప్రజలను మభ్యపెట్టే 'సుస్థిర వ్యవసాయం', 'నిరంతర హరిత విప్లవం', 'ప్రకృతి వ్యవసాయం', 'సేంద్రీయ వ్యవసాయం', 'మిద్దెతోట వ్యవసాయం', 'మరో హరిత విప్లవం' వంటి నినాదాలతో తరచూ పొద్దు పుచ్చుతున్నాయి, మభ్య పెడుతున్నాయి. ' 'దాతృత్వ పెట్టుబడిదారుల ఉచ్చులో పడ్డాయి.

వ్యవసాయ పరిజ్ఞానం, అభివృద్ధి అధ్యయన సంస్థ అంతర్జాతీయ స్థాయిలో (ఐఎఎస్‌డి) ఈ శతాబ్ది ప్రారంభంలో తమ అధ్యయనాన్ని వెలువరించింది. దాని ప్రకారం వనరుల రక్షణ, సుస్థిరత మనుగడ, చిన్న, సన్నకారు రైతుల 'కుటుంబ వ్యవసాయం' ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ఆధునిక యంత్రాలు, రసాయనాల మీద నడిచే పెద్ద కమతాల సేద్యం, సుస్థిరత, వనరుల రక్షణను కాపాడలేదు. పైగా అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా వంటి దేశాల పెద్ద భూ కమతాల సేద్యంలో ఒక కిలో కాలరీస్ ఆహార ఉత్పత్తి 10-20 కిలో కాలరీస్ శక్తిని (ఇంధనాన్ని కొత్త రసాయనాన్ని, విత్తనాల్ని) వాడటం జరుగుతున్నది. అదే కుటుంబ వ్యవసాయ కమతాల ద్వారా ఒక కిలో కాలరీస్ శక్తి ద్వారా 4-10 కిలో కాలరీస్ ఆహార ఉత్పత్తి జరుగుతున్నది. పైగా పెద్ద భూకమతాల కంపెనీలు ప్రభుత్వ రాయితీల సహాయాన్ని అతిగా పొందుతున్నారని తేలింది. (ప్రొ. రాజేశ్వరి ఎస్. రైనా, 2009 క్రోడీకరణ).

ఈ నేపథ్యంలో రూపొందిన ప్రపంచ ఆహార వ్యవసాయ నివేదికలు, క్యూబా వంటి చిన్న దేశం కుటుంబ వ్యవసాయ నిర్వహణ ద్వారా వనరుల రక్షణ కేంద్రంగా ఏ విధంగా ముందుకు పోతుందో తెలియ జేస్తున్నాయి. జాతీయ రైతు కమిషన్ ముఖ్య సిపార్సులు కుటుంబ వ్యవసాయానికి ఆదాయ - భద్రత ఎంత ముఖ్యమో వివరించింది. తక్కువ సమయంలో ఎక్కువ ఆహార ఉత్పత్తి అనే అవగాహన నష్టకరమని అనేక దేశాల్లో తేలింది. ముఖ్యంగా వనరులకు పరిమితులున్న దేశంలో 'ఉత్పత్తిదారులు' ప్రతికూలతలోకి నెట్టబడతారని పంజాబ్, ఆంధ్రప్రదేశ్ వంటి భారతదేశ రాష్ట్రాల్లో వేగంగా బయటకొచ్చింది. ప్రారంభదశలో లభించిన ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ మౌళిక సూత్రాలన్నీ తిలోదకానికి దారితీయటం పర్యావరణ పరంగానూ, ఆర్థికంగానూ నష్టకరమని హరిత విప్లవం నిరూపించింది. "కుటుంబ వ్యవసాయం" బదులుగా కంపెనీ వ్యవసాయం మంచిదనే భ్రమలోకి సమాజాన్ని నెట్టింది. వ్యవసాయేతర వృత్తి ముఖ్యంగా ప్రభుత్వ లేక కంపెనీల ద్వారా, నిర్దేశించబడే వ్యాపకం (ఉద్యోగం) ఆదాయ భద్రతనిస్తుందనే ధోరణి ప్రబలింది. వనరుల వాడకంలో పున్ణనిర్మాణంలో పూర్తి విచక్షణా రహితమైన ధోరణి ప్రబలింది. దాని ఫలితమే చిరుధాన్య పైర్లకు బదులుగా వరి, గోధుమ వంటి అధిక వనరుల వినియోగంతో ముడిపడిన వాటి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఒరవడి మార్చకుండా కేవలం "ప్రకృతి వ్యవసాయం" పేరుతో నడిచే సంస్కరణలతో వనరులు రక్షించబడవు. అలాగే సమాజపరమైన సమతుల్యత నిలబడదు. స్వామినాధన్ తన జాతీయ రైతు కమిషన్ నివేదిక ద్వారా, ప్రొ. రతన్‌లాల్ వంటి వ్యవసాయ నిపుణుడు తమ భూరక్షణ ఉద్యమాల ద్వారా తేల్చిందిదే. అందుకే ఆహార భద్రత నిలబడాలంటే ఉత్పత్తిదారుడి ఆదాయ భద్రత, వ్యవసాయ వృత్తి (వ్యాపార) పరమైన గౌరవం పునరుద్ధరించబడాలి. పదెకరాల గోధుమ, వరి వంటి పంటల సాగుదారుడి కంటే ఒక చిన్న ప్రభుత్వోద్యోగి జీవన భద్రత కలిగి ఉండడం ఈ దేశ వ్యవసాయ దుస్థితికి నిదర్శనం. ఈ వరవడిని మార్చలేని ప్రభుత్వాలు దేశ స్వావలంబనను నిలబెట్టలేవు. పర్యావరణ పతనాన్ని ఆపలేవు. జన్యుమార్పిడి ప్రక్రియల రూపంలో, రసాయన సాంకేతికాల పరంగా అనేక నూతన ఆవిష్కరణలు సామాజికంగానూ, ఆర్థికంగానూ, పర్యావరణ పరంగానూ నష్టకరమని బయటకొస్తూనే ఉంది. అయినా వ్యక్తిగత సంపద పెంచగలిగే వృత్తే సర్వస్వమనుకొనే కార్పొరేట్ వర్గం కుటుంబ వ్యవసాయానికి, ఉత్పత్తిదారుడి రక్షణకు అడ్డంకిగా మారుతుంది.

వ్యవసాయేతర వ్యాపకం లేక వృత్తి లేక వ్యాపారం లేక ఉద్యోగాలు విస్తరింపజేసినప్పుడే ఈ కుటుంబ వ్యవసాయం నిలబడుతుంది. "గొడ్డు చాకిరి" కేంద్రంగా ఆహార ఉత్పత్తి నడిచిన దేశాల్లో వ్యవసాయం విలువలేని వృత్తిగా మారుతుంది. చైనా, వియత్నాం, క్యూబా వంటి సోషలిస్టు దేశాలు నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్ వంటి పెట్టుబడిదారీదేశాలు దీన్ని నిరూపించాయి. వనరులను పతనం చేసే, కార్పొరేట్ పార్మింగ్ పద్ధతులు నడిచే అమెరికా, ఆస్ట్రేలియా దేశాల అనుభవాలు ప్రపంచానికి నేర్పుతున్న సత్యమిదే!

ప్రొ. ఎన్. వేణుగోపాలరావు 94900 98905

● విశాఖలో గురువారం ముఖ్యమంత్రి జగన్ పర్యటనకు ఏర్పాట్లను మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత వర్మ పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లపై విఎంఆర్‌డిఎ అధికారులకు పలు సూచనలు చేశారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలి

- సిపిఎం ఆధ్వర్యాన ధర్నా
- పేదలను మోసగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం ధర్నా జరిగింది. తాళ్లయపాలెంలోని అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద పేదలు, లబ్ధిదారులు ఈ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. అమరావతిని విచ్ఛిన్నం చేసి పేదలను మోసగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. పెత్తందారులపై పోరాటం, పేదల ప్రభుత్వమంటూ ముఖ్యమంత్రి మాటలే తప్ప చేతల్లో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అమరావతిలో 5 వేల మంది పేదలు ఐదేళ్ల క్రితం రూ.లక్షలు పెట్టి టిడ్కో ఇళ్లకు డిపాజిట్లు చెల్లించారని చెప్పారు. ఇళ్లన్నీ పూర్తయినా గత ప్రభుత్వం ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి ఖాళీగా ఉంచిందని విమర్శించారు. రాజధానిలో ఇళ్లు లేని పేదలు వేల సంఖ్యలో ఉన్నారని, ఒక్కరికి కూడా గజం స్థలం నాలుగేళ్లలో కేటాయించలేదని విమర్శించారు. ఇళ్లు ఇవ్వకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. పేదలకు కట్టిన ఇళ్లు, స్థలాలు ఇవ్వకుండా 50 వేల మందికి ఇతర జిల్లాల పేదలకు స్థలాలు కేటాయిస్తామని చెప్పటం మోసపూరితం కాదా? అని ప్రశ్నించారు. ఈ నెల 18న ఇళ్ల పట్టాలు ముఖ్యమంత్రి ఇస్తారని ప్రకటించారని తెలిపారు. ఈ లోపే రాజధాని పేదలకు టిడ్కో ఇళ్లు, స్థలాలు కేటాయించి పేదల పట్ల చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని చెప్పారు. ఒక్కొక్కరికి 3 సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు స్థలాలు ఇచ్చే దగ్గర రాజధాని లేకుండా నిర్వీర్యం చేసి రాష్ట్రానికి, పేదలకు ముఖ్యమంత్రి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అమరావతిలో పేదలకు స్థలాలు ఇస్తూ కాపురం విశాఖకు మారుస్తానని చెప్పటం ఏమిటని ప్రశ్నించారు. రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చి పేదలకు ఇళ్లు పూర్తి కాకుండా మొండి గోడలతో మిగిలిపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కారణం కాదా? అని నిలదీశారు. కనీసం రూ.5 లక్షలు లేకుండా ఇల్లు పూర్తవదన్నారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములు వైసిపి కార్యాలయానికి లీజుకు ఇచ్చారని పేర్కొన్నారు. విజయవాడలో ఖాళీగా ఉన్న 57 ఎకరాల డిస్నీ ల్యాండ్ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలకు ఇవ్వకుండా 25 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు ఇవ్వటం మోసపూరితం కాదా? అని ప్రశ్నించారు. పనిచేసే ప్రాంతంలో, ఉపాధి దొరికే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా దూరంగా ఇచ్చి చేతులు దులుపుకొని పేదలకు అన్యాయం చేయటం సమంజసమా? అని అన్నారు. రైతులకు, ప్రజలకు మధ్య చిచ్చుపెట్టే ఆలోచన తప్ప పేదలకు మేలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. రాజధాని అమరావతిని నిర్మించి, పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలు, రైతులను వంచించే చర్యలు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, కార్యదర్శివర్గ సభ్యులు ఎం భాగ్యరాజ్, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష అమలు సామాజిక బాధ్యత

- రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ బాబు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజలకు సుపరిపాలన అందజేతలో భాగంగా ప్రభుత్వాధికారులు సరళమైన వాడుక భాష తెలుగులోనే ప్రత్యుత్తరాలు జరపడం సామాజిక బాధ్యత అని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ బాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కార్యక్రమాల అమలులో తెలుగు భాష అమలుపై నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ, మౌఖిక భాషను పాలనా భాషగా అమలు చేయడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని కోరారు. మనం ఎక్కడ ఉన్నా ఆ బాధ్యతను నిర్వర్తించడం చాలా ముఖ్యం అన్నారు. తెలుగుభాష అమలు చేయాలన్న నిశ్చయం ఉండాలన్నారు. రాష్ట్రంలో తెలుగు భాషా వికాసానికి ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో తెలుగుభాషా ప్రాభవాన్ని సంస్కృతిని ప్రతిబింబించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజమహేంద్రవరం తెలుగు భాషకు అమ్మలాంటిదని విజయబాబు పేర్కొన్నారు. మనకున్న అపూర్వమైన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాల్సి ఉందన్నారు. అధికార భాష అమలులో భాగంగా ప్రభుత్వం తెలుగు అమలు కోసం రూపొందించిన పలు ఉత్తర్వులను ఆయన వివరించారు. రానున్న రోజుల్లో కోర్టుల ద్వారా వచ్చే తీర్పులు స్థానిక భాషలో ముద్రించి ఇచ్చే అవకాశం కోసం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వెళ్లి విన్నవిస్తామని చెప్పారు. డిఆర్ఓ జి.నరసింహులు మాట్లాడుతూ, స్పందన ఫిర్యాదుల విషయంలో నూరు శాతం తెలుగు అమలు చేస్తున్నామని, మిగిలిన వాటిని కూడా నూరుశాతం అమలు చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ ఎస్.మల్లిబాబు, ఎఎస్‌పి సిహెచ్.పాపారావు పాల్గొన్నారు.

గిరిజన బాలికపై అత్యాచారం

- కప్పి పుచ్చుకునేందుకు ప్రయత్నాలు
- ఆలస్యంగా వెలుగు లోకి..

ప్రజాశక్తి -అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అమాయక గిరిజన బాలికలతో వెట్టిచాకిరి పనులు చేయించడమే కాకుండా మాయ మాటలు చెప్పి నమ్మబలించి అత్యాచారంకు పాల్పడిన ఘటన మండలం లోని బొర్రాలో చోటు చేసుకుంది. బొర్రాలోని ఓ హోటల్ యజమాని అదే పంచాయతీకి చెందిన ఓ అమ్మాయితో రాత్రి పగలు తేడా లేకుండా వివిధ పనులు చేయించాడు.కొని రోజుల తర్వాత లోబర్చుకుని మాయమాటలు చెప్పి డబ్బును ఆశచూపి ఏకంగా గర్భవతిని చేశాడు. ఈ విషయాన్ని కప్పు పుచ్చుకునేందుకు ఆ హోటల్ యజమాని పంచాయితీ పెద్దలతో చేతులు కలిపాడు. బాలికను ఎంతో కొంత డబ్బులు ఇచ్చి బయట పొక్క కుండా ఉండేందుకు రెండు రోజుల క్రితం పంచాయతీ లో రాజీ జరిగినట్లు సమాచారం.ఈ విషయమై పోలీసులకు పిర్యాదు అందలేదు.

మోదకొండమ్మ జాతరకు భారీ బందోబస్తు

- 1400 మంది సిబ్బంది నియామకం
- ఏఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి- పాడేరు : రాష్ట్ర గిరిజన జాతర మోదకొండమ్మ అమ్మవారి మహోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు 1400 పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పాడేరు ఏఎస్‌పి ధీరజ్ వెల్లడించారు. మోదమ్మ జాతరకు జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో అనుసరించవలసిన ట్రాఫిక్ నియమావళి పై పోలీస్ శాఖ ద్వారా ముద్రించిన పోస్టర్లను ఎఎస్పి ధీరజ్, సీఐ సుధాకర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జాతరకు పాడేరు పట్టణంలో చేపడుతున్న పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను వివరించారు. వాహనాల రద్దీని క్రమబద్ధీకరించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియమావళిని అమలు చేస్తున్నామని చెప్పారు.అరకు, పెదబయలు, హుకుంపేట వైపు నుండి పండగ నిమిత్తము వచ్చే వాహనాలను తలారిసింగి సిఏహెచ్ స్కూల్ వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని అటువైపు వచ్చే వాహనాలన్నీ అక్కడే పార్క్ చేయాలని సూచించారు. పెదబయలు, హుకుంపేట నుండి చోడవరం, జి.మాడుగుల వెళ్ళవలసిన వాహనాలు - అడ్డుమండ మీదుగా సంతాడపల్లి చెక్ పోస్ట్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. జి.మాడుగుల నుండి పండగ నిమిత్తం వచ్చే వాహనాలు సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలం వద్ద పార్క్ చేయాలన్నారు. మాడుగుల నుండి పెదబయలు, హుకుంపేట, చోడవరం వెళ్ళే వాహనాలు లగిసపల్లి, నక్కలపుట్టు, వంతాడపల్లి, అడ్డుమండ మీదుగా వెళ్లాలని, చోడవరం వైపు నుండి పండగకు వచ్చే వాహనాలు జంక్షన్ వద్ద పార్కింగ్ స్థలం వద్ద పార్క్ చేయాలన్నారు. చోడవరం వైపు నుండి జి.మాడుగుల వైపు వెళ్ళే వాహనాలు నక్కలపుట్టు, లగిసపల్లి, సెయింట్ ఆన్స్ జంక్షన్ మీదుగా వెళ్లాలని సూచించారు. జాతర సందర్భంగా ఈ నెల 13 నుండి 17 వరకు ఘాట్ రోడ్డులో మరియు పాడేరు మీదుగా వెళ్లే భారీ వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. జేబు దొంగల నుంచి మొబైలు ఫోన్, విలువయిన వస్తువులు జాగ్రత్తగా భద్రపరుచు కోవాలని సూచించారు. చిన్న పిల్లలను జాతరలో విడిచి పెట్ట రాదని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనవసరంగా వాహనాలతో జాతరలో తిరగ రాదని తెలిపారు. పండుగ ప్రాంతాలలో మద్యం తాగి వాహనాలు నడప రాదని ఇంటి కి వెళ్లేటప్పుడు ప్రజలు తమ వాహనాలను నెమ్మదిగా జాగ్రత్తగా నడపి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో కంటింజెంట్ వర్కర్లుగా పనిచేస్తున్న స్కూల స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ స్కూల్ స్వీపర్స్ యూని యన్ నాయకులు బుధవారం స్కూల్స్ డిఐ బి.దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై అధికారుల దష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, మున్సిపల్ స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు ఝాన్సీ మాట్లాడుతూ 30, 40 ఏళ్లుగా రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో కంటెంజెంట్ వర్కర్లుగా పని చేస్తున్న స్కూల్ స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మున్సిపల్ స్కూల్స్‌ని జిల్లా విద్యా శాఖలో విలీనం చేసిన నేపథ్యంలో స్కూల్స్ ఆయల ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడిందని అన్నారు. మున్సిపల్ అధికారులు, విద్యాశాఖల మధ్య సమన్వయ లోపంతో స్కూల్ స్వీపర్లు ఏప్రిల్ నెల జీతాల బిల్లులు కూడా మున్సిపల్ అధికారులుగానీ, విద్యా శాఖ అధికారులు గానీ తీసుకోలేదన్నారు.

పార్ట్ టైం వర్కర్లుగా నియమించినప్పటికీ ఉదయం 8 నుంచి సాయంత్రం స్కూల్ ముగిసేవరకు పని చేయి స్తున్నారని, జీతం మాత్రం పార్ట్ టైం వర్కర్‌కు ఇచ్చే రూ.4000 మాత్రమే ఇస్తున్నారన్నారు. కార్పొరేషన్, విద్యా శాఖ అధికారులు సమన్వయంతో స్కూల్ స్వీపర్ల వేతన బాలాయాలు ఇవ్వాలని, ఏప్రిల్ నెల జీతాల బిల్లులు తీసుకుని జీతాలు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీసవేతనం రూ.12000 ఇవ్వాలని కోరారు.

సెలవుల్లో విధులపై డిఇఒకు వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సెలవుల్లోనూ విధులు కేటాయించడంపై నిరసన తెలియజేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు డిఇఒ అబ్రహాంకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. వెకేషన్ ఎంప్లాయిస్‌గా ఉన్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులలో నాడు -నేడు పాఠశాల విధులు, ఉయ్ లవ్ రీడింగ్ నిర్వహణ, ఎన్‌సిఇఆర్‌టి శిక్షణ తరగతులు, పదో తరగతి సప్లమెంటరీ విద్యార్థులకు క్లాసుల నిర్వహణ, పాఠ్యపుస్తకాలకు సంబంధించిన విధులు, హాబిటేషన్ సెన్సస్ తదితర విధులు కేటాయించారన్నారు. ఈ విధులకు సంబంధించి ఎటువంటి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వెకేషన్ ఉద్యోగులు వేసవి సెలవుల్లో విధులు నిర్వహిస్తే సదరు పని చేసిన రోజులకు గాను సంపాదిత సెలవులు మంజూరు చేయాల్సి ఉంటుందని, కనుక వెంటనే తగు చర్యలు తీసుకొని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ పి.జయకర్ సెక్రటరీ జనరల్ పి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఎ.షరీఫ్ పాల్గొన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్ (పశ్చిమగోదావరి జిల్లా)

మంజూరైన నిధులతో ఎక్కడా నాణ్యత తగ్గకుండా సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి మైలాబత్తుల సోనీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రస్తుత వాతావరణం అనువైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలంలో పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, నాడు - నేడు పాఠశాల అభివృద్ధి, రహదారుల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసి సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించుకుని 85 శాతం పూర్తిచేసుకుని రాష్ట్రంలోనే నరసాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన పనులను కూడా సకాలంలో పూర్తి చేసి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో శివారు ప్రాంత ప్రజలకు పుష్కలంగా స్వచ్ఛమైన తాగునీరందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశాలు నిర్వహించేటప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరు లేకుండా ఎంపిడిఒ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత ముఖ్యమైన సమావేశానికి హాజరు కాకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుతాళ్లులో పిండివారిమెరక ప్రాంతంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులున్నాయని జెడ్‌పిటిసి సభ్యులు బొక్కా రాధాకృష్ణ, శాసన సభ్యులు దృష్టికి తీసుకురాగా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారిని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు సభ్యులు బొక్కా.రాధాకృష్ణ, వైస్‌ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, ఎంపిడిఒ ఎన్‌విఎస్.ప్రసాద్ యాదవ్, తహాశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, ఎంఇఒ పి.పుష్పరాజ్యం, వ్యవసాయ శాఖ ఎఒ శామ్యూల్ జాన్సన్ పాల్గొన్నారు.

సిపిఎం,గిరిజన సంఘం పోరాటంతో బ్రిడ్జి పనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మండలంలోని బొండం పంచాయతీ జయంతివలస, కొత్తవలస రోడ్డు వంతెన సిపిఎం, గిరిజన సంఘం పోరాట ఫలితంగా వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం 2019 (ఎస్ సి ఎ)లో సెంట్రల్ గ్రాంట్ రెండు కోట్లు నిధులు మంజూరు చేసింది. గుత్తేదారుడు 2019 డిసెంబర్‌లో పనులు ప్రారంభించి గోడ వరకు ఫిలర్స్ లెవెల్ వరకు పనులు చేశాడి. బిల్లులు రాలేదని గుత్తేదారులు మధ్యలోని పనులు నిలిపివేశారు.దీంతో మళ్లీ సిపిఎం, గిరిజన సంఘం నాయకులు గిరిజనులు కలిసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని పాదయాత్ర చేపట్టారు. ఈ పోరాట ఫలితంగా గత నెల నుండి బ్రిడ్జి పనులు ప్రారంభించి బుదవారం బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తి చేసారు. బ్రిడ్జి నిర్మాణం పనులు నాణ్యత పాటించాలని బుధవారం పరిశీలించిన గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గత్తుం బుజ్జిబాబు, నాయకులు కె.బుజ్జిబాబు, టి.జోషి తెలిపారు. ఆనంతరం వారు మాట్లాడుతూ, అనేక రూపంలో పోరాటం చేయడంతో ఫలితంగా బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి అయ్యిందన్నారు.

స్టాంపు పేపర్లే అక్కర్లేదు

- ఈ - స్టాంపింగ్ అయినా చట్టబద్ధమే
- ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డిఐజి కె.అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు

అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్టాంపు పేపర్లే అక్కర్లేదని, ఈ- స్టాంపింగ్ అయినా చట్టబద్ధమేనని ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డిఐజి కె.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రజలు సాంప్రదాయకంగా నాన్ జుడీషియల్ స్టాంపులను వాడటం పరిపాటి అని, నాన్ జుడీషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారిచే ఈ-స్టాంపింగ్ విధానం ఇటీవలే ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ-స్టాంపింగ్ విధానంలో కూడా ప్రజలు తమకు అవసరమైన నాన్ జుడీషియల్ స్టాంపులను పొందవచ్చన్నారు. ఈ స్టాంపింగ్ ద్వారా వేయబడిన స్టాంపులు, సాధారణ నాన్ జుడీషియల్ బాండు పేపర్లతో సమమైన చలామణీ గలవన్నారు. వీటిని దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తం కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చన్నారు. ఈ- స్టాంపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం లైసెన్సుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటే, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారు సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తున్నారన్నారు. పైగా, దస్తావేజులను నాన్ జుడీషియల్ స్టాంపుల మీద రాసుకున్నా, ఈ స్టాంపింగ్ ద్వారా ముద్రలు పొందినా రిజిస్ట్రేషన్‌కు అనుమతించేలా సబ్ రిజిస్ట్రార్లందరికీ మార్గదర్శకాలు ఇప్పటికే జారీ చేశామన్నారు. మీ సమీపంలోని ఈ-స్టాంపింగ్ కేంద్రాల, లైసెన్స్ వెండర్ల అందుబాటు వివరాలను www.registration.ap.gov.in, http://www.shcilestamp.com తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల్లో వాడకంలో ఉండి, సులువుగా, వేగంగా, వెంటనే పూర్తయ్యే ఈ-స్టాంపింగ్ విధానాన్ని ప్రజలు విరివిగా వినియోగించుకోవాలన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - తణుకు రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

రైతులకు అండగా ఉండి, రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం తణుకు మండలం తేతలి, కొండయ్యపాలెం, మండపాక గ్రామాల్లో రైతుల కల్లాల్లోని ధాన్యాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డితో కలిసి మంత్రి కాకాని గోవర్ధన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రైతులు ఎటువంటి ఇబ్బందీ పడకుండా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పొలంలో ఉన్న పంటకు నష్టం జరిగితే సబ్సిడీ చెల్లించడం జరుగుతుందన్నారు. రైతుల గురించి తెలియని ప్రతిపక్ష నాయకులు కూడా ఈరోజు రైతుల గురించి మాట్లాడుతున్నారన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. అనంతరం మండపాకలో ఆర్‌బికెను మంత్రులు సందర్శించారు. ఆర్‌బికెలో రైతుల నుంచి సేకరించిన ధాన్యం నమూనాలను, పంపిణీకి సిద్ధంగా ఉంచిన గోనె సంచులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.భరణి ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శివరామప్రసాద్, ఆర్టికల్చర్ అధికారి దుర్గేష్, తహాశీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ కార్డులు పునరుద్ధరించాల్సిందే

గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మండలంలోని అరమ పంచాయతీ బడిమెలగ్రామంలో రేషన్ కార్డులు తొలగించిన లబ్ధి దారులతో బుధవారం ఆ గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటిసభ్యులు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా సంక్షేమ పథకాలు పొందుతున్న పేద గిరిజనులకు 5ఎకరాల పైబడి భూములు ఉన్నాయని, కీల్లో అర్జున్, బురిడీ రామచంద్ర, కొర్ర పూర్బ్, కొర్ర మిన్ను, గోల్లోరి శ్రీనివాసరావు, గోల్లోరి రామచంద్ర, కొర్ర సహాదేవ్, గోల్లోరి గాసి అనే గిరిజనులకు ఇటీవల కాలంలో రేషన్ కార్డులు తొలగించడంతో రేషన్ కార్డు ద్వారా పొందుతున్న పథకాలు, నిత్యావసర సరుకులు, ఫింఛన్లుతొలగించడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికి ఉచిత సంక్షేమ పథకాల అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పు కొంటుంది తప్ప పూర్తిగా అమలు పరచ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టి.రామారావు, జి.జగన్నాథం, కె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన పీలా గోవింద

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అనకాపల్లి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గంలో చేస్తున్న పార్టీ కార్యక్రమాలపైనా, సమస్యలపైనా చంద్రబాబుకు వివరించారు. ఈ నెల 19న అనకాపల్లి నియోజకవర్గంలో జరగబోయే చంద్రబాబు పర్యటనపై చర్చించారు. ప్రజా సమస్యలపై మరింతగా పోరాడాలని, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్‌లను వేగవంతం చేయాలని చంద్రబాబు సూచించినట్లు పీలా తెలిపారు. నియోజకవర్గంలో వినూత్నంగా కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం, ఉపాధి హామీ కూలీలతో రచ్చబండ కార్యక్రమాలు చేయడంపై ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించినట్లు చెప్పారు.

రికవరీ ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న 116 మంది బాధితులకు రికవరీ చేసిన ఫోన్లను బుధవారం ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ బాధితులు పోగొట్టుకున్న మొత్తం రూ.68 లక్షల విలువైన 357 మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు. మొదటి విడతలో 131 మొబైల్ ఫోన్లు (విలువ రూ.25 లక్షలు), రెండో విడతలో 110 మొబైల్ ఫోన్లు (రూ.23 లక్షలు), 3వ విడత (ప్రస్తుతం) 116 ఫోన్లు (రూ.20 లక్షలు) జిల్లా పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాల ద్వారా అందించామని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 95052 00100కు హాయ్ అని టైప్ చేసి, ఖుఎజూఎశీఎఙశ్రీవేఖుఎ- వతీ.ఆఆ లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మొబైల్స్ ట్రేస్ చేసిన ఐటి కోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపునాయుడు, ఐటి కోర్ ఎస్సై రఘు వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో నాగ చైతన్య సందడి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖ)

శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై పవన్ కుమార్ సమర్పణలో వెంకట్ ప్రభు దర్శకత్వంలో అక్కినేని నాగ చైతన్య కథానాయకుడిగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందించిన కస్టడీ చిత్రం ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో నాగ చైతన్య చిత్ర విశేషాలను మీడియాకు వివరించారు. ఈ సినిమాకి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా తనయుడు యువన్ శంకర్ రాజాతో కలిసి సంగీతం అందించడం విశేషం అన్నారు. వైజాగ్‌లో తీసిన తన ప్రతి సినిమా హిట్ అవుతుందని నమ్మకంగా చెప్పారు. అరవింద్ స్వామి, శరత్ కుమార్, ప్రియ మణి వంటి సీనియర్ నటులు ఇందులో నటించారని తెలిపారు. సినిమాలో ప్రతి పది నిమిషాలకు ట్విస్ట్‌లు ఉంటాయన్నారు. నిర్మాతలు శ్రీనివాస్, పవన్ కుమార్ ఎంతో సపోర్ట్ చేసి సినిమా తీశారని ధన్య వాదాలు తెలిపారు. అనంతరం మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ, కస్టడీ సినిమాను శివ సినిమాతో పోల్చవద్దు అని కోరారు. దర్శకుడు వెంకట్ ప్రభు చెప్పిన కథ మొదటి సిటింగ్‌లోనే బాగా నచ్చిందన్నారు. హీరోగా అన్ని జోనర్ సినిమాలు చేస్తానన్నారు. ఈ సినిమా తమిళ ప్రేక్షకులను కూడా అలరిస్తుందని తెలిపారు. మంచి కథ కుదిరితే అఖిల్‌తో సినిమా చేయాలని ఉందన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు పరిధిలో బీటెక్ ఫలితాలను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన బుధవారం సాయంత్రం విడుదల చేశారు. బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది హాజరవ్వగా 13,137 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 90.55 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని చెప్పారు. ఇందులో బాలురు 7,888 మంది హాజరవ్వగా 6,836, విద్యార్థినులు 6,620 మంది హాజరవ్వగా, 6,301 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలకు సంబంధిత రీకౌంటింగ్ ఫొటో కాపీ, ఛాలెంజ్ వాల్యూయేషన్‌కు నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని చెప్పారు. గురువారం నుంచి వీటిని దరఖాస్తుచేసు కోవచ్చునని తెలిపారు. బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సప్లిమెంటరీ నోటిఫికేషన్‌ను జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

18,500 జీతం చెల్లించాలంటూ

క్లాప్ డ్రైవర్ల బిక్షాటన



ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

జెసిఎల్ ఆదేశం మేరకు జిఒ 7ను అనుసరించి క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు వందలాదిమంది క్లాప్ డ్రైవర్లు భిక్షాటన చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం గేటు వద్ద రూ.18,500 జీతం చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, గురువారం విశాఖ నగరానికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన స్వహస్తాలతో విడుదల చేసిన జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం వివక్ష లేకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన డైరెక్షన్‌ను అమలు చేయించాలని కోరారు. యూనియన్ తరపున ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ దోపిడీ వ్యవస్థ లేకుండా ఆప్కాస్‌ను తెచ్చామని జిఒ 136 తెచ్చాక, మరలా క్లాప్ డ్రైవర్ల వ్యవస్థలో కాంట్రాక్టర్‌ను పెట్టడం సమంజసం కాదన్నారు. సిఎం ఇచ్చిన జిఒ ప్రకారం రూ.18,500 చెల్లించకుండా కేవలం రూ.12,500 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఇది అన్యాయం అన్నారు. అవినీతిని సహించనన్న సిఎం మాట నిలుపుకోవాలన్నారు. కటింగులు పోగా రూ.10 వేలు వస్తే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని యూనియన్ నాయకుడు పి.అనీల్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, కార్మిక సమస్యలు చెప్పుకోడానికి ముఖ్యమంత్రి ఇంటర్వ్యూ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.రమణ, నాయుడు, అప్పారావు, సురేష్, అప్పన్న, అభి, సుధాకర్, రామకృష్ణ ప్రసంగించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఆపండి

- **కబ్జాదారులకు అండగా నిలవడం సరికాదు**
- **ఉపముఖ్యమంత్రి బూడికి సిపిఎం బహిరంగ లేఖ**

ప్రజాశక్తి-దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా

దేవరాపల్లి మండలం తారువ, మారేపల్లి, దేవరాపల్లి రెవెన్యూల పరిధిలోని భూ ఆక్రమణలను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడుకు బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న బహిరంగ లేఖ రాశారు. లేఖలోని వివరాలు... తారువ రెవెన్యూ సర్వే నెంబరు 179లో రెడ్డి వారి చెరువు, మరికొన్ని సర్వే నెంబర్లలో గతంలో ఉన్న తహశీల్దార్ రమేష్‌బాబు ప్రభుత్వ భూములగా గుర్తించి బోర్డులు పెట్టారు. ఆ చుట్టు పక్కల భూములు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభుత్వ భూములను అడ్డగోలుగా కబ్జా చేశారు. దీనిపై విఆర్ఒ, సర్వేయరు పరిశీలించి ఆక్రమణలు జరిగినట్లు డిప్యూటీ తహశీల్దార్‌కు తెలియజేశారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 20లో 38 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా, మీరు అడ్డుపడుతున్నారు. వీటితో పాటు మరికొన్ని కోర్టు వివాదాల్లో ఉన్న భూముల విషయంలో నిజాయితీగా పని చేసిన డిప్యూటీ తహశీల్దార్‌ను అనకాపల్లి కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై మీరు పంపించేశారన్న ఆరోపణలున్నాయి. మారేపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 115లో 23.15 ఎకరాల దేవుని మాన్యం భూమిని మీ స్వగ్రామం తారువకు చెందిన కొంతమంది అన్యాక్రాంతం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మేశారు. దీనిపై చర్యలకు ప్రయత్నించిన ఇద్దరు దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్లను బదిలీ చేయించారు. ఈ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోకుండా మీరు అడ్డం పడుతున్నారు. దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 280/1లో డి.పట్టాదారుడు అయిన క్షత్రియ దేవిసింగ్ మరణించగా, ఆ భూమిని ఆక్రమించిన వారు, చనిపోయిన సదరు పట్టాదారుని పేరున కోర్టులో కేసులు వేసి ఆ భూముల్లో ఫలసాయాన్ని పొందుతున్నారు. ఇదే రెవెన్యూ సర్వే నెంబరు 281/2లో 281/2ఎగా తప్పుడు రికార్డులు సృష్టించి ఫలసాయాన్ని పొందుతున్నారు. ఈ భూములు ఆక్రమించిన వారందరూ మీ పార్టీలో ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారు, వారి బంధువులే. మీ అండతో రెవెన్యూ అధికారులను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. దీంతో ఈ భూముల్లోకి వెళ్లడానికి రెవెన్యూ అధికారులు భయపడి ఉదారంగా ఉంటున్నారు. చట్టాన్ని అమలు చేయవలసిన మీరు, నిజాయితీగా పని చేస్తున్న అధికారులను బదిలీ చేయడం, డిప్యూటేషన్‌పై పంపించడం వంటి చర్యలు ప్రజలకు బాధ కలిగిస్తోంది. ఇప్పటికైనా ఈ భూ ఆక్రమణలు నిలుపుదలకు రెవెన్యూ అధికారులకు తగు అదేశాలు ఇవ్వాలని సిపిఎం నేత వెంకన్న ఆ లేఖలో కోరారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి- పరవాడ (అనకాపల్లి జిల్లా)



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యాన ఉపాధి హామీ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకానికి బడ్జెట్లో ఈ సంవత్సరం రూ.60 లక్షల కోట్లకు కేటాయింపులు తగ్గించిందని, దీంతో కూలీలకు శ్రమ తగ్గ వేతనం అందడం లేదని, పని దినాలు తగ్గుతున్నాయని తెలిపారు. రెండు పూటలా పనులు చేయించడం, ఫొటోలు, ఫేస్ యాప్ వంటి నిబంధనలు పెట్టి కూలీలను పనికి దూరం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పనిముట్లకు అదనం గా డబ్బులు, వేసవి అలవెన్స్ ఇచ్చేవారని, వాటిని ఇప్పుడు తీసివేశారని తెలిపారు. ఈ పథకానికి లక్ష కోట్లు బడ్జెట్ పెంచి కోరిన అందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజుకు కనీస కూలి రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మంచినీరు, మెడికల్ కిట్లు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్‌లు, పనిముట్లకు డబ్బులు ఇవ్వాలని, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని ఎంపీడీవో వి.వేమ సుందరరావుకు అందజేశారు. దీనికి స్పందించిన ఆయన పని ప్రదేశంలో మెడికల్ కిట్లు ఏర్పాటు చేస్తామని, ఇతర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మిక సంఘం నాయకులు సి హెచ్ వెంకటలక్ష్మి, పి.భవాని, రెడ్డి ముత్యాలమ్మ, ఆర్ కొండ మ్మ, పి పార్వతి, పి జయ భారతి, ఎం పద్మ, ఏ పుష్ప, ఆర్ కళ్యాణి, బి వెంకటలక్ష్మి, వి నాగమణి, ఎస్ కుమారి, వెన్నెల పాలెం, భరిణికం, గొర్లి వానిపాలెం, పరవాడ, గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

43 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అక్రమంగా తరలిస్తున్న 43 కేజీల గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ కథనం ప్రకారం... ముందస్తు సమాచారం మేరకు మంగళవారం మారమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా ఆ వాహనాన్ని నిలుపుదల తనిఖీ చేశారు. వారివద్ద ఉన్న బ్యాగ్‌లో 43 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో సీలేరుకు చెందిన షేక్ ఆలీ, బుద్ధ లోకేష్‌కు ప్రమేయం ఉండగా, తెలంగాణ రాష్ట్రం భద్రాచలం కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన సవలము ప్రకాష్, ముదిగుండ ప్రశాంత్ కుమార్, అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన శెట్టి విశ్వనాథం గంజాయి తరలింపు చేశారు. నిందితుల నుండి నాలుగు సెల్ ఫోన్లు, రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సర్పంచులకు నిధుల పంచాయితీ

సచివాలయాల ఖర్చులు అదనం • కనీసం పన్నులు రాని పరిస్థితి
ఉన్న నిధులూ మళ్లిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పంచాయతీలను నిధుల లేమి వెంటాడుతోంది. కనీసం నిర్వహణ ఖర్చులు లేక సతమతమవుతున్నాయి. వచ్చే నిధులు రాకపోవడం, ఉన్న నిధులను ప్రభుత్వం మళ్లిస్తుండడంతో పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడుతోంది. కనీసం పన్నులు పంచాయతీలకు జమకాని పరిస్థితి నెలకొంది. దీంతో చిన్నపాటి పనులు కూడా చేయడానికి నిధుల్లేక సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీల్లో పాలన కుంటుపడుతోంది. గతంలో పంచాయతీల్లో వేసవి కాలం సమయంలో మోటార్లు, చేతి పంపుల మరమ్మతులు, చిన్న చిన్న రహదారులు నిర్మాణం వంటి పనులకు పంచాయతీ నిధులను వినియోగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. మరో వైపు పంచాయతీలకు సచివాలయాల నిర్వహణ అదనపు భారంగా మారింది. దీనికి తోడు విద్యుత్ బిల్లులు చెల్లింపు పంచాయతీలకు భారంగా తయార య్యింది. జిల్లాలో పం చాయతీల పరిస్థితి మరింత అధ్వానంగా మారు తోందని సర్పంచ్‌లే చెబు తున్నారు. తాము సర్పంచ్‌లుగా ఎన్నికైనా పనులు చేయడానికి నిధులు లేమి, మరో పక్క అధికారాలు అం తంత మాత్రంగా ఉండడంతో పాలన కష్ట తరంగా మారిందని వాపో తున్నారు. పంచా యతీలకు ఆసరాగా నిలిచే ఆర్థిక సంఘ నిధులు విద్యుత్ బిల్లులకు జమ చేస్తుండడంతో పంచాయతీల్లో నిధుల లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

పంచాయతీలపై అదనపు భారం..

జిల్లాలో 300 పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల్లో నిర్వహణ భారంగా పరిణమించింది. గతంలో బిల్లు కలెక్టర్లు ఉండడంతో పంచాయతీల్లో విధించే పన్నులను వారు వసూలు చేసే వారు. ఆ నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వాలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలు ఏర్పడిన తర్వాత ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నా నిర్వహణకు మాత్రం నిధులు లేక పంచాయతీలు దిక్కులు చూస్తున్నాయి. పైగా గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పంచాయతీలపై భారం పెరిగింది. కనీసం మంచినీటి సరఫరాకు నిధులు రాక పంచాయతీలే చేతి పంపులు, పైప్‌లైన్లు మరమ్మతులు చేయించుకుంటున్నాయి. మరోవైపు పాలనా పరంగా సైతం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్టేషనరీ ఖర్చులు పంచాయతీలే భరించాల్సిన పరిస్థితి. సచివాలయాలకు ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లకు సంబంధించిన బిల్లులను పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి రావడంతో పంచాయతీ పాలక వర్గాలు, కార్యదర్శులు సతమతం అవుతున్నారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనివారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ పరస్థితులను ఎలా అధిగమించాలో అర్థం కాని పరిస్థితుల్లో పాలకవర్గాలు ఇబ్బంది పడుతున్నాయి.

పనులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

పంచాయతీల్లో చేసే చిన్నపాటి అభివృద్ధి పనులకూ నిధులు లేక కాంట్రాక్టర్లు పనులు చేయ డానికి ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పంచాయతీల్లో వీధి దీపాలు రిపేరుకు వస్తే మార్చలేని పరిస్థితి. పారిశుధ్య నిర్వహణకు నిధులు అంతంత మాత్రంగానే ఉండడంతో గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడింది. ఆర్థిక సంఘ నిధులతో పాటు పంచాయతీలకు వచ్చే పలు రకాల నిధులను ప్రభుత్వం మళ్లించడంతో పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. పాలక ప్రభుత్వాలు ఇప్పటికైనా సానుకూలంగా స్పందించాలని పాలకవర్గాలు కోరుతున్నాయి.

21న అస్త్ర ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

సివిల్ సర్వీస్ ఆశావహులను ఎంపిక చేయడానికి ఈ నెల 21న ఆన్‌లైన్ పోటీ పరీక్ష నిర్వహించనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఎనలాగ్ ఐఎఎస్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు శ్రీకాంత్ విన్నకోట తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అగ్రగణ్యులుగా నిలిచినవారికి 100 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. అస్త్ర పరీక్ష ద్వారా ఉత్తమ సివిల్ సర్వెంట్లను తీర్చిదిద్దే లక్ష్యంతో ఎపి, తెలంగాణ రాష్ట్రాలలోని 67 జిల్లాలలో అత్యధిక శాతం మార్కులు సాధించి తొలి మూడు స్థానాలలో నిలిచేవారికి 80, 60, 50 శాతం రాయితీలతో ఉపకార వేతనాలుంటాయని తెలిపారు. రెండు గంటల నిడివిలో 100 మార్కులకు ఈ పోటీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష రాయదలచినవారు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. www.analogeducation.in లో లాగిన్ అయ్యి దరఖాస్తు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తిచేయడంలో సమస్య ఎదురైతే ఎనలాగ్ సంస్థ సహాయకులను 8494990066 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు మాత్రమే కాకుండా డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలు చదివే సివిల్స్ ఆశావహులు కూడా ఈ ఆన్ లైన్ పరీక్షల ద్వారా లాంగ్ టర్మ్ ట్యూషన్ ఫీజులో భారీ రాయితీ పొందే అవకాశం ఉంటుందన్నారు.

నేడు బ్లాక్ డే



రెజ్లర్లకు మద్దతు తెలుపుతున్న ఎఆర్ సింధు (ఇన్‌సెట్‌లో ధర్నా శిబిరం వద్ద రెజ్లర్లు)

- రెజ్లర్లకు కార్మిక సంఘాల మద్దతు
- బ్రిజ్ భూషణ్‌కు నార్కోటెస్ట్ చేయాలి : సాక్షి మాలిక్
- స్మృతి ఇరానీ ఈ అంశంపై ఎందుకు స్పందించరు? ఎఆర్ సింధు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు గురువారం బ్లాక్ డే పాటించనున్నారు. నల్ల రిబ్బన్లను ధరించి ఆందోళన చేయనున్నారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా కేంద్ర కార్మిక సంఘాలు నిరసనకు పిలుపునిచ్చాయి. సిఐటియు తరపున జాతీయ కార్యదర్శి ఎఆర్ సింధు బుధవారం సంఘీభావం తెలిపారు. రెజ్లర్ల ఆందోళన 18వ రోజు కొనసాగింది. జంతర్ మంతర్‌లో రెజ్లర్లను కలిసిన బాక్సర్ నీరజ్ గోయట్ వారి పోరాటానికి మద్దతు ఇవ్వాలని దేశ ప్రజలందరినీ అభ్యర్థించారు.

ప్రజలందరూ ఉద్యమంలో చేరాలి : సాక్షి మాలిక్

ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ సాక్షి మాలిక్ మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్‌కు నార్కో టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఎ) తాత్కాలిక ప్యానెల్ ఆధ్వర్యాన అన్ని పోటీలు జరగాలని కోరుకుంటున్నామని, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ ప్రమేయం ఉంటే వ్యతిరేకిస్తామని తెలిపారు. ఉద్యమంలో ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. "ఇప్పుడు మాట్లాడటం సరైనదని అనిపించింది. మేము మాట్లాడుతున్నాం. మీ సోదరి, కూతురు నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు ఇలా మాట్లాడి ఉండేవారు కాదా?" అని సాక్షి మాలిక్ తమపై విమర్శలు చేస్తున్న వారినుద్దేశించి ప్రశ్నించారు. "మీరు నిజాన్ని దాచవచ్చు, మీరు దానిని అణచివేయలేరు. గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నాం. మా నిరసనలో పాల్గొనాలని దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం' అని అన్నారు. న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. రెజ్లర్ వినేష్ ఫొగట్ మాట్లాడుతూ రెజ్లింగ్ సమాఖ్యకు విరాళంగా ఇచ్చే నిధులు అథ్లెట్లకు చేరాయో లేదో తనిఖీ చేయాలని రతన్ టాటాను కోరారు.

ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ మహిళా కమిషన్ సమన్లు

ఢిల్లీ పోలీసులకు ఆ రాష్ట్ర మహిళా కమిషన్ బుధవారం సమన్లు జారీ చేసింది. పోక్సో కేసులో బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయడంలో విఫలమైనందుకు ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ మహిళా కమిషన్ (డిసిడబ్ల్యు) ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ సమన్లు జారీ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదని స్వాతి మలివాల్ తెలుసుకున్న తర్వాత జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి)కి సమన్లు జారీ చేసి, ఈ అంశంపై వివరణ కోరారు. యాక్షన్ నివేదికతో ఈ నెల 12న హాజరు కావాలని కమిషన్ డిసిపిని కోరింది.

స్టేటస్ రిపోర్ట్ సమర్పించండి : ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ కోర్టు నోటీసులు

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల కేసుపై స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలంటూ ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ బుధవారం విచారించారు. ఈ నెల 12వ తేదీలోగా తదుపరి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశిస్తూ, అదే తేదీకి కేసు వాయిదా వేశారు.

స్మృతి ఇరానీ ఎందుకు మాట్లాడరు? : ఎఆర్ సింధు

జంతర్ మంతర్ వద్ద నిరసన వేదిక వద్దకు చేరుకున్న కార్మిక సంఘాల నేతలు రెజ్లర్లతో సమావేశమయ్యారు. రెజ్లర్లకు న్యాయం చేయాలని దేశంలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు తెలుపుతామని నేతలు పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సిద్ధంగా లేదని, కుల, మత సమీకరణలు కలగలిపి పోరాటాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని సిఐటియు జాతీయ కార్యదర్శి ఎఆర్ సింధు విమర్శించారు. న్యాయ వ్యవస్థను సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఇది అనుమతించినట్లయితే, వారు భవిష్యత్తులో అన్ని నిబంధనలను ఉల్లంఘిస్తారని పేర్కొన్నారు. అన్ని విషయాలపై స్పందించే కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ రెజ్లర్ల సమస్యపై మౌనంగా ఎందుకు ఉన్నారని సింధు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, ఐఎన్‌టియుసి నేత అశోక్ సింగ్, ఎఐయుటియుసి నేత సంతోష్ రాజ్, టియుసిసి నేత రాజేందర్, సేవా నాయకురాలు లత తదితరులు పాల్గొన్నారు. హర్యానా కార్మిక సంఘాల ప్రతినిధులు గురువారం నిరసన ప్రదేశానికి చేరుకోనున్నారు.

పార్లమెంటరీ కమిటీకి లేఖ

కేంద్ర క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ వివేక్ ఠాకూర్‌కి టిఎంసి ఎంపి సుస్మితా దేవ్ లేఖ రాశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మన్ బ్రిజ్ భూషణ్‌పై ఏడుగురు మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలను ఆమె ప్రస్తావించారు. క్రీడా సమాఖ్యలు, ఇతర సంస్థలకు వర్తించే అన్ని చట్టాల అమలు, క్రీడా మంత్రిత్వ శాఖ పాత్రను సమీక్షించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని కోరారు.

అదానీపై సుప్రీంకు నివేదిక

- రేపు విచారణ



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్‌పై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలకు సంబంధించి విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ న్యాయస్థానానికి తన నివేదికను సీల్డ్ కవరులో అందజేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ జరుపుతుంది. సుప్రీంకోర్టు లేవనెత్తిన అన్ని అంశాల పైన ఈ కమిటీ విచారణ జరిపిందీ లేనిదీ తెలియరాలేదు. విచారణను పూర్తి చేసేందుకు మరికొంత సమయం అడుగుతుందా లేదా అన్నది కూడా తెలియడం లేదు. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు కేంద్ర ప్రభుత్వం సూచించిన సభ్యుల పేర్లను న్యాయస్థానం ఫిబ్రవరి 17న తిరస్కరించింది. సొంతగా ఆరుగురు నిపుణులతో కమిటీని నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎఎం సప్రే నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో మాజీ బ్యాంకర్లు కెవి కామత్, ఒపి భట్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, సెక్యూరిటీస్ న్యాయవాది సోమశేఖర్ సుందరేశన్, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జేపీ దేవధర్ సభ్యులుగా ఉన్నారు. రెండు నెలల్లో విచారణను పూర్తి చేయాలని కమిటీని, సెబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. సెబీ మాత్రం మరో ఆరు నెలల గడువు కోరింది. అదానీ గ్రూప్ షేర్ల ధరల విషయంలో అక్రమాలకు పాల్పడిందని, తన సంస్థ విలువను ఎక్కువగా చూపిందని హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

అదాని కంపెనీలకు ఐక్యరాజ్య సమితి షాక్

అదాని గ్రూపులోని మూడు కంపెనీలకు ఐక్యరాజ్య సమితిలోని కీలక విభాగం షాక్ ఇచ్చింది. ఉద్గారాల తగ్గింపులో పారిశ్రామికవర్గాలకు సహాయపడే ఐక్యరాజ్యసమితి మద్దతు గల సైన్స్ బేస్డ్ టార్గెట్స్ ఇనిషియేటివ్ (ఎస్‌బిటిఐ) ప్రకారం.. ఉద్గారాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్న కంపెనీల జాబితాలో మూడు అదానీ గ్రూప్ కంపెనీలు తమ స్థానాన్ని కోల్పోయాయి. ఈ జాబితాలో అదానీ గ్రీన్, అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్‌లు ఉన్నాయని బ్లూమ్‌బర్గ్ ఓ నివేదికలో తెలిపింది. అదాని కంపెనీలు క్లైమట్ గ్రూప్ ఆమోదాన్ని కోల్పోయాయని వెల్లడించింది. చాలా మంది పెట్టుబడిదారులు స్థిరమైన ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టాలని భావించేవారు తరచుగా ఎస్‌బిటిఐ ఆమోదం కోసం ఎదురు చూస్తుంటారని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. వచ్చే దశాబ్దంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నామని గౌతం అదాని గతేడాది పేర్కొన్నారు. యుఎన్ఓ తాజా నిర్ణయం అదాని గ్రూపునకు ఇది భారీ దెబ్బే అని నిపుణులు భావిస్తున్నారు.

బాంబే ఐఐటి దళిత విద్యార్థి ఆత్మహత్య కేసులో నిందితుడికి బెయిల్

ముంబయి : బాంబే ఐఐటి దళిత విద్యార్థి దర్శన్ సోలంకి ఆత్మహత్య కేసులో నిందితుడికి ముంబయిలో ప్రత్యేక కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. ఈ బెయిల్ ఉత్తర్వుల సమగ్ర కాపీ బుధవారం అందుబాటులోకి వచ్చింది. సోలంకీని ఖత్రి వేధింపులకు గురి చేశాడని చెప్పడానికి సరైన ఆధారాలు లేవని ఉత్తర్వుల్లో పేర్కొంది. సూసైడ్ నోట్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'దర్శన్‌ను నిందితుడు ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు చూపించడానికి ప్రత్యేకంగా ఏమీ లేదు' అని తెలిపింది. నిందితుడిన్ని దోషిగా నిర్ధారించడానికి సూసైడ్ నోట్‌లో ఆరోపణలు సరిపోవని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అదే ఐఐటికి చెందిన 18 ఏళ్ల అర్మాన్ ఖత్రికి ఈ నెల 6న అదనపు సెషన్స్ జడ్జి ఎపి కనడే బెయిల్ మంజూరు చేశారు. అహ్మదాబాద్‌కు చెందిన దళిత విద్యార్థి దర్శన్ ఈ ఏడాది ఫిబ్రవరి 12న బాంబే ఐఐటి హాస్టల్ భవనంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏప్రిల్ 11న దర్శన్ గదిలో 'అర్మాన్ నన్ను చంపాడు' అని ఒక లైన్ నోట్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం కనుగొంది.

ట్రంప్ లైంగిక వేధింపులు నిజమే

5మిలియన్ల డాలర్లు నష్టపరిహారంగా చెల్లించాలన్న కోర్టు

వాషింగ్టన్ : లైంగిక వేధింపుల కేసులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషి అని మన్‌హటన్ న్యాయస్థానం నిర్ధారించింది. రచయిత, కాలమిస్ట్ ఇ.జేన్ కేరోల్‌పై ట్రంప్ లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం వాస్తవమేనని జ్యూరీ పేర్కొంది. ట్రంప్ ఆమెపై అత్యాచారానికి పాల్పడలేదని, కానీ లైంగిక వేధింపులు చోటు చేసుకున్నాయని కోర్టు తన రూలింగ్‌లో పేర్కొంది. మూడు గంటల పాటు విచారించిన తర్వాత ఈ తీర్పు వెలువడింది. కాలమిస్ట్ కేరోల్‌కు నష్టపరిహారంగా 5మిలియన్ల డాలర్లు చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పింది. కేరోల్ నష్టపరిహారం ఎంత కావాలో తన పిటిషన్‌లో పేర్కొనలేదు. న్యాయమూర్తుల నిర్ణయానికే వదిలివేసింది. ఈ వేధింపులు జరిగింది 1996లో అయినా 2019లో కేరోల్ తాను రాసిన పుస్తకంలో ఈ విషయాలు బయట పెట్టారు. ఈ కేసు విచారణ సందర్భంగా ట్రంప్ న్యాయస్థానానికి హాజరు కాలేదు. అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు ట్రంప్ ప్రచారం జరుపుతున్న వేళ ఈ లైంగిక వేధింపుల ఆరోపణలు ట్రంప్‌ను చుట్టుముడుతున్నాయి. కేరోల్ ఆరోపణలపై ట్రంప్ స్పందిస్తూ కేవలం పుస్తకాల అమ్మకాలు పెంచుకునేందుకే ఆమె ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తనను వేధింపులకు గురి చేసేందుకు ఇదంతా చేస్తున్నారని తాజాగా తీర్పు అనంతరం ట్రంప్ ప్రకటన చేశారు. మొత్తంగా 12మందికి పైగా మహిళలు ట్రంప్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు.

మయన్మార్‌లో హింసను ఆపండి

- ఆసియాన్ నేతల పిలుపు

లబువాన్ బాజో, ఇండోనేషియా : సైన్యం పాలనలో వున్న మయన్మార్‌లో తక్షణమే హింసను, ఘర్షణలను ఆపాలని ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఆసియాన్) నేతలు బుధవారం పిలుపునిచ్చారు. అన్ని పక్షాలను కలుపుకుని పోయేలా చర్చలు జరిగేందుకు అనుమతించాలని, మానవతా సాయాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా అందేలా చూడాలని వారు కోరారు. ఈ మేరకు సదస్సులో ఒక ప్రకటన జారీ చేశారు. "మయన్మార్‌లో కొనసాగుతున్న హింస పట్ల మేం తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం. అన్ని రూపాల్లో హింసను తక్షణమే విరమించాలని కోరుతున్నాం. జాతీయ చర్చలకు వీలు కల్పిస్తూ, సురక్షితంగా, సకాలంలో మానవతా సాయం అందేందుకు అనుకూలమైన వాతావరణాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం." అని ఆ ప్రకటన పేర్కొంది.

జి7 సదస్సుకు రాలేకపోవచ్చు : బైడెన్

వాషింగ్టన్ : వచ్చేవారం జపాన్‌లో జరగనున్న జి 7 దేశాల సదస్సుకు హాజరవాలనే భావిస్తున్నానని, ప్రభుత్వ రుణ పరిమితి ప్రతిష్టంభన అలాగే కొనసాగిన పక్షంలో తాను రాలేకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. తమ ప్రభుత్వం ఎదుర్కొంటున్న రుణాల చెల్లింపు సమస్యను నివారించేందుకు కాంగ్రెస్‌తో జరుగుతున్న చర్చల్లో పురోగతి సాధించకపోతే ఆ పర్యటన రద్దయ్యే అవకాశాలు వున్నాయని సూచనప్రాయంగా తెలిపారు. ప్రస్తుత ఎజెండాలో ఇదే అత్యంత ముఖ్యమైన అంశమని ఆయన వ్యాఖ్యానించారు. వైట్‌హౌస్‌లో కాంగ్రెస్ నేతలు, స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీతో సమావేశానంతరం బైడెన్ విలేకర్లతో మాట్లాడారు. బైడెన్ రాకపోయే అవకాశాలు వున్నాయంటూ అమెరికా ప్రభుత్వం నుండి తమకు ఇంతవరకు ఎలాంటి సమాచారం రాలేదంటూ జపాన్ ప్రభుత్వ ప్రతినిధి హిరొకజు మస్తునో బుధవారం తెలిపారు. రుణ పరిమితిని పెంచేందుకు కాంగ్రెస్ సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోకపోతే జూన్ 1నాటికల్లా ప్రభుత్వం వద్ద నగదు అయిపోతుందని, రుణాల చెల్లింపుల్లో సమస్యను ఎదుర్కొనవచ్చని గత వారమే అమెరికా ఆర్థిక మంత్రి హెచ్చరించారు.

నేపాల్ మాజీ హోం మంత్రి అరెస్టు

ఖాట్మండు : నేపాల్ మాజీ హోం మంత్రి, నేపాల్ కాంగ్రెస్ నేత బాలకృష్ణ ఖండ్‌ను ఆయన నివాసంలో బుధవారం అరెస్టు చేశారు. భూటాన్ శరణార్థులుగా నేపాలీయులను విదేశాలకు అక్రమంగా తరలించిన కుంభకోణంలో ఖండ్ ప్రమేయం వుందన్న ఆరోపణలపై ఆయనను అరెస్టు చేసి, ఖాట్మండు పోలీసు సర్కిల్‌లో వుంచినట్లు పోలీసులు తెలిపారు. భూటానేతరులను తృతీయ దేశాలకు భూటాన్ శరణార్థులుగా పంపుతున్న ఈ కేసుకు సంబంధించి గతంలో అరెస్టయిన వారు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఖండ్‌ను అరెస్టు చేసినట్లు అసిస్టెంట్ ఇనస్పెక్టర్ జనరల్ శ్యామ్‌లాల్ గ్యావలి తెలిపారు. గతంలో అరెస్టయిన ఇద్దరిని ఖండ్ హోం మంత్రిగా వున్నపుడు వచ్చిన రాజకీయ ఒత్తిడి కారణంగా విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూన్‌లో మోడీ అమెరికా పర్యటన

వాషింగ్టన్ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్‌లో అమెరికాలో పర్యటించనున్నారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత మోడీ అమెరికాలో పర్యటించడం ఇదే మొదటిసారి. వచ్చే నెలలో మోడీ అమెరికా పర్యటనను వైట్ హౌస్ బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. జూన్ 22న ప్రధాని మోడీకి అధ్యక్షులు బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్ అధికారిక విందు ఇవ్వనున్నారని తెలిపింది. భారత ప్రధాని అమెరికా పర్యటన రెండు దేశాల ప్రజల మధ్య ఉన్న లోతైన, సన్నిహిత భాగస్వామ్యాన్ని ధృవీకరిస్తుందని వైట్‌హౌస్ తన ప్రకటనలో పేర్కొంది.

తమిళనాడు బిజెపి చీఫ్‌పై స్టాలిన్ పరువు నష్టం కేసు

తమిళనాడు : తమిళనాడు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కె.అన్నామలైపై స్టాలిన్ ప్రభుత్వం బుధవారం పరువునష్టం కేసు వేసింది. స్టాలిన్, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడుతున్నారని, ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపిస్తూ సోషల్‌మీడియాలో అన్నామలై వరుస వీడియోలు పోస్ట్ చేశారు. ఆయన వ్యాఖ్యలు, సోషల్‌మీడియాలో పోస్టు చేసిన వీడియోల ఆధారంగా స్టాలిన్ ప్రభుత్వం పరువు నష్టం కేసు వేసింది. అన్నామలై వ్యాఖ్యలను డిఎంకె ప్రతినిధి టికెఎస్ ఎలంగోవన్ ఖండించారు. 'కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఏమీ అనకుండానే బిజెపి ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. అలాంటప్పుడు అన్నామలై చేస్తున్న తప్పుడు ఆరోపణలపై పరువు నష్టం కేసు వేయొచ్చు' అని ఎలంగోవన్ అన్నారు.

వాట్సాప్‌పై ఆరోపణలను పరిశీలిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ : వాట్సాప్‌యాప్‌పై వచ్చిన ఆరోపణలను కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుంది. ఈ విషయాన్ని ఆ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. వాట్సాప్‌యాప్‌ను ఉపయోగించని సమయంలోనూ బ్యాక్‌గ్రౌండ్‌లో మైక్రోఫోన్ పనిచేస్తుందంటూ ట్విట్టర్‌లో ఇంజనీరింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఫౌదాడబిరి ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలతో ఫౌదా చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. సుమారు ఆరు కోట్ల మందికి పైగా ఈ ట్వీట్ చూశారు.

కేరళలో మహిళా డాక్టర్ హత్య

- వైద్య సేవలందిస్తుండగా ఉన్మాది ఘాతుకం
- వైద్యురాలి కుటుంబాన్ని పరామర్శించిన సిఎం పినరయి విజయన్
- సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ



డాక్టర్ వందన, నిందితుడు సందీప్



డాక్టర్ కుటుంబాన్ని ఓదార్చుతున్న సిఎం పినరయి విజయన్

కొచ్చి : విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్‌ను ఓ ఉన్మాది దారుణంగా హత్య చేసిన ఘటన కేరళలోని కొట్టారక్కర తాలూకా ఆసుపత్రిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ఇద్దరు పోలీసులు, నిందితుడి బంధువు కత్తిపోట్లకు గురయ్యారు. ఎడిజిపి ఎంఆర్ అజిత్‌కుమార్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం మద్యానికి బానిసైన ఉపాధ్యాయుడు సందీప్ తనను స్థానికులు కొడుతున్నారంటూ పోలీసు ఎమర్జెన్సీ నెంబరుకు ఫోన్ చేశాడు. సందీప్ శరీరంపై గాయాలుండటంతో పోలీసులు అతని సమీప బంధువు, స్థానికుడితో కలిసి తాలూకా ఆసుపత్రికి తీసుకొచ్చారు. క్యాజువాలిటీలో పరిశీలించిన వైద్యులు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లగా, సందీప్ ఒక్కసారిగా ఉన్మాదిలా మారిపోయాడు. సమీపంలోని రెండు కత్తెరలు తీసుకుని హోంగార్డును పొడిచాడు. అక్కడికి పరిగెత్తుకు వచ్చిన ఎఎస్ఐ, అతని బంధువును పొడిచాడు. దీంతో, డాక్టర్లు, సిబ్బంది పక్కగదిలోకి పరుగులు తీశారు. అక్కడ చిక్కుకుపోయిన డాక్టర్ వందనా దాస్‌ను కత్తెరతో పొడవడంతో, ఆమె తీవ్రంగా గాయపడి మరణించారు.

సమగ్ర విచారణ జరిపిస్తాం : సిఎం

ఈ ఘటన గురించి తెలుసుకున్న సిఎం పినరయి విజయన్ ఆసుపత్రికి చేరుకుని డాక్టర్ వందనాదాస్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. 'డాక్టర్ వందనా దాస్ విధి నిర్వహణలో హత్యకు గురికావడం దిగ్భ్రాంతికరం. అత్యంత బాధాకరం. వైద్యం కోసం తీసుకొచ్చిన వ్యక్తి వైద్యురాలిపై దాడి చేయడం, అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు, ఇతరులపై దాడి చేయడం ఘోరం. ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం' అని సిఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నివేదిక ఇవ్వండి : పోలీసులకు హైకోర్టు ఆదేశం

మహిళా డాక్టర్ హత్యపై గురువారం నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది. ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో హాజరు కావాలని పేర్కొంది. నిందితులను వైద్యుల ముందు ప్రవేశపెట్టేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

8రోజులు కస్టడీకి ఇమ్రాన్

- తోషఖానా అవినీతి కేసులో దోషిగా నిర్ధారణ
- పిటిఐ కార్యకర్తల నిరసనలు



పిటిఐ కార్యకర్తలు తగులపెట్టిన బస్సు

ఇస్లామాబాద్ : అవినీతి కేసులో అరెస్టయిన పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను బుధవారం ఇక్కడ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, ఆయనకు ఎనిమిది రోజుల పాటు రిమాండ్ విధించింది. ఓ కేసులో విచారణకు హాజరయ్యేందుకు ఇస్లామాబాద్ హైకోర్టుకు హాజరైన ఇమ్రాన్‌ను పారా మిలటరీ రేంజరు మంగళవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వ ఖజానాకు రూ.5వేల కోట్లకు పైగా నష్టపరచిన అల్‌ఖదీర్ ట్రస్టు కేసులో విచారణ ప్రారంభమైన వెంటనే, ఖాన్‌ను 14రోజుల పాటు రిమాండ్‌కు పంపాల్సిందిగా నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఎబి) తరపు లాయర్లు కోరారు. ఖాన్ తరపు న్యాయవాది స్పందిస్తూ, తన క్లయింట్‌పై నమోదైన అభియోగాలన్నీ కల్పితాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాగా, ప్రభుత్వ బహుమతుల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తాల వివరాలను దాచడానికి సంబంధించి రెండవ కేసు కూడా జిల్లాసెషన్స్ కోర్టులో విచారణ జరగనుంది. గతేడాది పాక్ ఎన్నికల కమిషన్ ఈ కేసును దాఖలు చేసింది. పాలకులకు, పార్లమెంటేరియన్లకు, బ్యూరోక్రాట్లకు ఇతర దేశాల ప్రభుత్వాధినేతలు, విదేశీ ప్రముఖులు ఇచ్చే బహుమతులను ప్రధానిగా రాయితీ ధరకు కొనుగోలు చేసి వాటిని లాభాలకు అమ్ముకున్నారన్నది ఈ రెండో కేసు సారాంశం.

దేశవ్యాప్త సమ్మెకు పిటిఐ పిలుపు

ఇమ్రాన్ అరెస్టును తీవ్రంగా నిరసిస్తున్న పిటిఐ నాయకత్వం సమ్మెకు సిద్ధం కావాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చింది. పెరుగుతున్న ఫాసిజాన్ని నిరసించాలని, ఏదో ఒకటి తేల్చుకునే క్షణం ఆసన్నమవుతోందని పేర్కొంది. ఇస్లామాబాద్, రావల్పిండి, లాహోర్, కరాచి, గుజ్రాన్‌వాలా, ఫైజలాబాద్, ముల్తాన్, మర్దన్ నగరాల్లో పిటిఐ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. కరాచిలో పోలీసులతో ప్రదర్శకులు ఘర్షణ పడ్డారు. పోలీసు వాహనాలపై రాళ్ళు విసరడం, వీధి లైట్లను పగలగొట్టడం చేశారు. ఇమ్రాన్‌ను విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు.

మరోపక్క తమ నేతను కలుసుకునేందుకు, విచారణను చూసేందుకు వస్తున్న పిటిఐ నేతలను లోపలకు రానివ్వకుండా విస్తృతంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మీడియాను కూడా లోపలకు రానివ్వడం లేదు. తమను అనుమతించనందుకు నిరసనగా పిటిఐ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషి, సెక్రటరీ జనరల్ అసద్ ఉమర్‌లు పోలీసులపై కేసు వేసేందుకు హైకోర్టుకు వెళ్ళారు. కానీ ఈలోగానే వారిద్దరినీ అరెస్టు చేశారు. ఉమర్‌పై రెండు కేసులు నమోదు చేశారు. అంతకుముందు ఖురేషి మీడియాతో మాట్లాడుతూ, శాంతియుత నిరసన అనేది రాజ్యాంగ హక్కు, దాన్ని ఉపయోగించుకోండి, అంతేకానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కార్యకర్తలను కోరారు.

పోలింగ్ ప్రశాంతం

- 72.22 శాతం పోలింగ్
- చెదురుమదురుగా ఘర్షణలు, హింసాత్మక ఘటనలు



బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి ఒకలిపురం బూత్ వద్ద ఓటర్లు

బెంగళూరు : చెదురుమదురు ఘటనలు మినహా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 72.22శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. శనివారం ఓట్ల లెక్కింపు జరగనుంది. ఫలితాలు అదే రోజు మధ్యాహ్నానికల్లా వెలువడనున్నాయి.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బిజెపి భావిస్తుండగా, ప్రభుత్వ వ్యతిరేకత పనిచేస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. 61స్థానాల్లో పట్టు కలిగిన జెడిఎస్ కీలక పాత్ర పోషించే అవకాశం వుంది. 224 అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్, జెడిఎస్ ప్రధానంగా పోటీ పడుతున్నాయి. మొత్తంగా 2,165మంది అభ్యర్థులు బరిలో వున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతతో సహా వృద్ధులు కూడా పెద్ద సంఖ్యలోనే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంటినుండే ఓటు వేసే అవకాశం వుందన్న విషయాన్ని తమకు తెలియజేయలేదని, అందువల్లే పోలింగ్ కేంద్రాలకు ఇబ్బందిపడి రావాల్సివచ్చిందని సీనియర్ సిటిజన్లు, వికలాంగులు ఫిర్యాదు చేశారు. మరోవైపు, బిజెపి, కాంగ్రెస్, జెడిఎస్ రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కన్నడ సినీ తారాగణం కూడా తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంది. ముఖ్యమంత్రి బొమ్మైతో సహ రాజకీయ ప్రముఖులందరూ ఓటు వేశారు. జెడిఎస్ కింగ్ మేకర్ కాదని కింగ్ అవుతుందని మాజీ సిఎం కుమారస్వామి వ్యాఖ్యానించారు. బిదాడిలో ఆయన తన ఓటు వేశారు. ఈసారి ప్రజలు పారదర్శక ప్రభుత్వం కావాలనుకుంటున్నారని ఖర్గే వ్యాఖ్యానించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 72.36శాతం నమోదైంది.

ఘర్షణలు, దాడులు

కల్బుర్గిలో బిజెపి నిర్వహిస్తున్న కాల్ సెంటర్‌పై ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడి చేసింది. కాంగ్రెస్ చేసిన ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. బిజెపి అభ్యర్థులకే ఓటు వేయాలంటూ ఆ కాల్‌సెంటర్ నుండి ఓటర్లకు కాల్స్ వెళుతున్నాయని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

విజయపురా జిల్లాలోని బసవనా బెగవాడి తాలుకాలో మసబినాల్ గ్రామంలో కోపోద్రిక్తులైన గ్రామస్తులు ఇవిఎంలను, వివిపిఎటి (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రెయిల్) యంత్రాలను ధ్వంసంచేశారు. పోలింగ్ అధికారుల వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. పోలింగ్ అధికారిపై కూడా చేయి చేసుకున్నారు. పోలింగ్‌ను మధ్యలోనే ఆపేసి అధికారులు ఇవిఎంలు, వివిపిఎటిలను మారుస్తున్నారని వదంతులు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి 23మందిని అరెస్టు చేసినట్లు ఇసి ప్రకటించింది.

బెంగళూరులోని పద్మనాభనగర్ నియోజకవర్గంలో పాపయ్యా గార్డెన్ పోలింగ్ బూత్ వద్ద కొంతమంది యువకులు కర్రలతో తమ రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేశారు. అక్కడ విధ్వంసం సృష్టించారు. దీంతో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న కొంతమంది మహిళలు గాయపడ్డారు.

బళ్లారి జిల్లాలోని సంజీవరాయనకోటలో కొంతమంది కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు ఘర్షణ పడ్డారు.

జెడిఎస్‌తో పొత్తు పెట్టుకోం : కెపిసిసి చీఫ్

కనకపురా నియోజకవర్గంలో ఓటు వేసిన అనంతరం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్, జెడిఎస్‌ల మధ్య ఎన్నికల అనంతర పొత్తు వుండబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పారదర్శక ప్రభుత్వం కావాలనుకుంటున్నారు : ఖర్గే

ప్రగతిశీల, పారదర్శక, సంక్షేమ దృక్పథం కలిగిన ప్రభుత్వాన్ని ఎంచుకోవాలని కర్ణాటక ప్రజలు నిర్ణయించుకున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. పెద్ద సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కల్బుర్గిలోని బసవానగర్‌లోని కీర్తి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రానికి తన భార్య రాధాభాయ్ ఖర్గేతో కలిసి వచ్చి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత 55 సంవత్సరాలుగా ఈ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్నానని, ఇక్కడ ప్రజల ఉత్సాహాన్ని చూస్తే.. కచ్చితంగా కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని, మెజార్టీతో పార్టీ గెలుపు సాధిస్తుందని భావిస్తున్నా'నని అన్నారు.

దాడుల్లో రూ.58లక్షలు నగదు స్వాధీనం

మంగళవారం రాత్రి చిత్రదుర్గలో జెడిఎస్ అభ్యర్థి రఘు ఆచార్ నివాసం నుంచి రూ.58 లక్షలను స్వాధీనం చేసుకున్నటు ఐటి, ఎక్సైజ్, ఎన్నికల, పోలీసు అధికారులు తెలిపారు. కవర్లలో పెట్టి పంపిణీకి సిద్ధంగా వున్న మొత్తాలు రూ.50 లక్షలు వున్నాయని, మరో 8,83,000 నగదు విడిగా వుందని పోలీసులు చెప్పారు. 239 లీటర్ల బీరును కూడా స్వాధీనం చేసుకున్నారు.

2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో నాలుగున్నర రెట్లు అధికంగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇసి ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుండి 463కోట్ల విలువైన మొత్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో నగదు, లిక్కర్, ఆభరణాలు, మాదకద్రవ్యాలు, వంటివి వున్నాయని తెలిపింది.

ఒక లోక్‌సభ, నాలుగు అసెంబ్లీ స్థానాలకు..

దేశవ్యాప్తంగా బుధవారం ఒక లోక్‌సభ, నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పంజాబ్‌లోని జలంధర్ లోక్‌సభ స్థానానికి బుధవారం ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ స్థానం ఎంపి సంతోఖ్ సింగ్ చౌదరీ (కాంగ్రెస్) జనవరిలో మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమయింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, 50.27 శాతం ఓటింగ్ నమోదయిందని అధికారులు చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లోని రెండు అసెంబ్లీ స్థానాలు సౌర్, చాంబేకు ఎన్నికలు జరిగాయి. ఇక్కడ అత్యల్పంగా 41.78 శాతం, 39.51 శాతం ఓటింగ్ నమోదయింది. ఒడిషాలోని జార్సుగూడా అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో 68.12 శాతం ఓటింగ్ నమోదయింది. బుధవారం మేఘాలయలోని సోహింగ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అత్యధికంగా 90 శాతం ఓటింగ్ నమోదయింది.

వేసవి విడిది

రైతు కష్టం



ఒక ఊరులో గంగన్న అనే సన్నకారు రైతు ఉన్నాడు. తనకు వ్యవసాయం తప్ప మరో పని తెలియదు. ఓ ఏడాది వర్షాలు లేక పంట ఎండిపోయి నష్టం వచ్చింది. అయినా పట్టు వదలకుండా అప్పు చేసి మరీ మరో ఏడాది వ్యవసాయం చేశాడు. ఆ ఏడాది వర్షాలు బాగా పడ్డాయి. పంట బాగా పండింది. దాంతో గంగన్న ఆనందించాడు. వచ్చే ఆదాయంతో అప్పు తీరి, కుటుంబంతో సంతోషంగా ఉండొచ్చు అనుకున్నాడు. ధాన్యం బస్తాలను బండిలో ఎక్కించి అమ్మేందుకు పట్టణం తీసుకెళ్లాడు.

కాని అక్కడ వ్యాపారులు ఆ ధాన్యం తీసుకుని ఐదు వేలు ఇచ్చారు. పది వేలు పంటకు ఐదు వేలు ఇచ్చారేంటి అని గంగన్న ప్రశ్నించాడు. 'ఈ రోజు ధర ఇంతే ఉంది. ఇంత కంటే ఒక్క రూపాయి కూడా ఇచ్చేది లేదు.' అంటూ కఠినంగా మాట్లాడాడు వ్యాపారి. దాంతో గంగన్న ఏడుస్తూ ఉండిపోయాడు. ఆ వచ్చిన డబ్బుతో అప్పు తీరదని బాధపడ్డాడు. ఏం చేయాలో తెలియక ఇంటికి వచ్చాడు. జరిగిన విషయాన్ని భార్యకు చెప్పాడు. ఇక రైతు కష్టాలు ఎప్పటికీ తీరవని నిర్ణయించుకున్నారు. చనిపోదాం అనుకున్నారు. అప్పుడే స్కూలు నుంచి ఇంటికి వచ్చిన తేజ వారి మాటలు విన్నది. వారి ప్రయత్నాన్ని అడ్డుకుంది. తరువాత ముఖ్యమంత్రికి లేఖ రాసింది.

"గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి.. మా నాన్న సంవత్సరం పాటు కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేక అప్పులు అయ్యాయి. అవి తీర్చలేక చనిపోదాం అనుకుంటున్నాడు. అప్పుడు నేను అనాధనవుతాను. మీరే మా సమస్యకు పరిష్కారం చూపగలరు. ఎవరి కష్టానికైనా తగిన గిట్టుబాటు ధర రావాలి కదా? ఏళ్లకు తరబడి రైతు ఇలా దు:ఖించటం రాజ్యానికి మంచిది కాదు కదా?' అని పేర్కొంది. సిఎం ఎలా స్పందిస్తారో అని తేజ ఎదురుచూస్తోంది.



ఫ్రెండ్స్, దేశానికి ధాన్యం పండిస్తున్న రైతులు మన చుట్టూ, ఎందరో ఉంటారు. వారికి మన సపోర్టు అందిద్దాం. సరేనా?.

- ఎం. తేజశ్రీ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ హైస్కూలు,

ఫ్యాషన్

-పాశం స్వేచ్ఛా గీతిక,
1వ తరగతి,
ఎంపియుపి స్కూలు,
ఏడుగుండ్లపాడు,
మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా.



మట్టి ఇల్లు కట్టాం ..

హాయ్ ఫ్రెండ్స్,



మేము ముగ్గురం స్నేహితులం. గన్నవరం చెంచుకాలనీలో ఉంటాం. మా అమ్మానాన్నలు వంటసామగ్రి అమ్ముతూ ఉంటారు. మేం మా ప్రాంతంలో నిర్వహిస్తున్న ఆదర్శ ట్యూషన్ సెంటర్‌కు వెళుతున్నాం. అక్కడ మాకు ఒక టాస్క్ ఇచ్చారు. మట్టితో కట్టి చూపించమన్నారు. అప్పుడు మేం ముగ్గురం కలసి మెత్తటి బంకమట్టి, కొన్ని పుల్లలు, రాళ్లు, పువ్వులు సేకరించాం. ఓ థర్మాకోల్ షీట్ తీసుకుని దానిమీద బంకమట్టితో పెద్ద కొండలా తయారుచేశాం. ఆ కొండపై ఇల్లు.. దాని చుట్టూ అందమైన ప్రహరీ పెట్టాం. ఇంటికి చేరుకోవడానికి మెట్లు తయారుచేశాం. కొండకు రెండు పెద్ద పెద్ద గుహల మాదిరి రంధ్రాలు చేశాం. ఇంటిముందు బావి ఆకారంలో ఓ తొట్టి తయారుచేశాం. అందులో నీళ్లు పోశాం. ఇంటిముందు పూల కుండీ ఏర్పాటుచేశాం. ఇంకా ఇంటి ఆవరణలో కూర్చోనేందుకు కుర్చీ కూడా కట్టాం. బావి పక్కన అందమైన పార్కును కట్టాం. ఇదంతా తయారు చేస్తుంటే భలే సరదాగా అనిపించింది. మా ఇంటి దగ్గర దొరికే పూలతో ఇంటిని అలంకరించాం. ఇది చూసి మా ట్యూషన్ టీచర్ మమ్మల్ని బాగా మెచ్చుకున్నారు.



- అసైల్, రాణి, అను
చెంచుకాలనీ,
గన్నవరం.

నేను గీసిన బొమ్మ





- కె. బాబా సందీప్,
6వ తరగతి,
జెడ్. పి. ఉన్నతపాఠశాల,
మైదుకూరు,
కడప జిల్లా.


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన the family

JEEVANA

మీ కోసం

ఆమ్లెట్ పొంగినట్లు రావాలంటే, చిటికెడు పంచదార లేదా మొక్కజొన్న పిండి కలపాలి.



జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి.

విద్యానందిని





చదువంటే ఆమెకు ప్రాణం... కూతురు ఆసక్తిని గమనించిన తండ్రి రోజు కూలీగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా ఆమె చదువుకు ఆటంకం కలిగించలేదు. పైగా ఎన్ని కష్టాలొచ్చినా చదువు ఆపొద్దని ఆమెకు చెప్పాడు. తన స్థోమతను బట్టి ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాడు. అయితేనేం ఆ చదువుల తల్లి సాధించిన ఘనత ఇప్పుడు దేశంలోనే ఆమె పేరు మార్మోగిపోయేలా చేసింది. తమిళనాడు దిండిగల్ జిల్లాకు చెందిన నందిని ఇటీవల 12వ తరగతి పరీక్షలు రాసింది. తాజాగా విడుదలైన ఫలితాల్లో 600 మార్కులకు 600 సాధించి రికార్డు సృష్టించింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల అన్నామలైర్ మిల్స్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న నందిని తమిళం, ఇంగ్లీషు, ఎకనామిక్స్, కామర్స్, అకౌంట్స్, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టులన్నింటిలో వందకు వంద మార్కులు సాధించింది.

'మా నాన్న కష్టమే నన్ను ఇంత పెద్ద విజయం సాధించేలా చేసింది. 'నా చదువే నా ఆస్తి' అని నాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. నా కలలను సాకారం చేసుకునేందుకు ఎంతో ప్రోత్సహించారు' అంటూ తండ్రి గురించి నందిని చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో కన్నీటిపొరలు కనిపించాయి.

నందిని తండ్రి శరవణన్ కుమార్ రోజు కూలీకి వడ్రంగి పని చేస్తారు. తల్లి భానుప్రియ గృహిణి. తమ్ముడు నందిని చదువుతున్న స్కూల్లోనే ఆరో తరగతి చదువుతున్నాడు. 'నా కూతురు చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండేది. మేము ఎంత కష్టపడుతున్నామో రోజూ చూసేది. మా భారం తగ్గించాలని ఎప్పుడూ అనుకునేది. చదువు ద్వారా మా కష్టాలు తీరతాయని బలంగా నమ్మింది. నా బిడ్డకు నేను ఆస్తులు కూడగట్టలేదు. కాబట్టి చదువుకు ఆటంకం కలిగించకూడదనుకున్నాను. తను ఇంత ఘనత సాధిస్తుందని కలలో కూడా ఊహించలేదు' అంటూ ఆ తండ్రి కూతురు విజయం గురించి ఆనందంగా చెబుతున్నప్పుడు కంటినిండా నీళ్లతో మాటలు తడబడ్డాయి.

'నందిని ఈ ఘనత సాధిస్తుందని మేము ముందే ఊహించాం. గతేడాది 11వ తరగతి పరీక్షల్లో తనకు 600 మార్కులకు గాను 598 సాధించింది. కష్టపడి చదువుతుంది. చాలా తెలివిగలది. టీచర్ల ప్రోత్సాహంతో స్కూల్లో చెప్పిన పాఠాలు అభ్యసించే ఈ ఘనత సాధించింది. ట్యూషనుకు కూడా వెళ్లలేదు' అంటూ తమ విద్యార్థి సాధించిన ఘనతను చెబుతున్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయిని అఖిల.

'చదువంటే నాకు చాలా ఇష్టం. స్కూల్లో.. ఇంట్లో ఎలా చదువుకోవాలో స్వయంగా టైమ్‌టేబుల్ వేసుకునేదాన్ని. నా స్నేహితులు చాలాసార్లు బయటికి వెళదామని, సినిమా చూద్దామని పిలిచేవారు. కాని నేను వెళ్లేదాన్ని కాదు. క్లాసు రూంలో అర్థం కాని పాఠాలను చదువుకునేందుకు ఇంట్లో ఎక్కువ సమయం కేటాయించేదాన్ని. నా అభ్యాసం తెల్లవారుజాము నుండే ప్రారంభమయ్యేది' అని చెబుతున్న నందిని ఇంగ్లీషు, తమిళం రెండు మాధ్యమాల్లోనూ నైపుణ్యత ప్రదర్శించేది.

చదువులోనే కాదు సాహిత్యంలోనూ ప్రతిభ కనబరిచే నందిని ఇంగ్లీషు, తమిళంలో కవితలు, రచనలు చేసేది. సిఏ చదవాలని ఆశపడుతున్న నందినికి ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా తోడుగా నిలిచింది. 'చదువే నా ఆస్తి' అని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో అభినందించారు. తన చదువుకు తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. 'నమ్మకం ఉంటే ఏదైనా సాధించగలం. ఎవరో వచ్చి మిమ్మల్ని ప్రోత్సహించనక్కర్లేదు. నేను అలాగే అనుకున్నాను. నా కాళ్లపై నిలబడాలనుకున్నాను. నా చదువు.. నా కల.. అది నెరవేరేలా చేసుకోవడం నా బాధ్యత..' అంటున్న నందిని మాటలు నేటి విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకం.

ఎండు ఖర్జూరంతో ఆరోగ్యం

ఈ ఎండకు ఎన్ని నీళ్లు తాగినా... చెమట రూపంలో ఎన్నో లవణాలు బయటకు పోయి నీరసం వస్తుంది. అదే రోజుకు నాలుగు, ఐదు ఎండు ఖర్జూరాలు తింటే పోయిన లవణాలు తిరిగి వస్తాయి. దీనిలో చాలా అనేక పోషకాలు ఉన్నాయి. ఖర్జూరంలో వివిధ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.




- కొలెస్ట్రాల్‌ను తగ్గించి బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి. ఇవి రక్త కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది కంటి సంబంధిత రుగ్మతల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.
- ఖర్జూరంలో ఫ్లేవనాయిడ్స్ ఉన్నాయి. ఇవి మధుమేహం, అల్జీమర్స్ వ్యాధి మరియు కొన్ని రకాల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.
- ఖర్జూరంలో రాగి, సెలీనియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముక సంబంధిత రుగ్మతలను నివారిస్తుంది.
- ఖర్జూరంలో ఉన్న విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తం గడ్డకట్టడాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.
- ఖర్జూరంలో కోలిన్, విటమిన్ బి ఉన్నాయి. ఇది గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి ని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా అల్జీమర్స్ వ్యాధి ఉన్న వారు వీటిని తింటే మంచి ఫలితం ఉంటుంది.
- సహజ ఫైబర్ అధికంగా ఉండి ప్రేగు కదలికలను క్రమబద్ధీకరించడానికి మరియు మీ మొత్తం జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
- కాలేయ ఫైబ్రోసిస్‌ను నిరోధించడంలో కూడా పని చేస్తాయి. ఆరోగ్యకరమైన కాలేయ పనితీరుకు శరీరానికి సహకరిస్తుంది.

రామ్ కొత్త సినిమా అప్డేట్



బోయపాటి శ్రీను, రామ్ పోతినేని కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా గురించి తాజాగా ఓ అప్డేట్ అందుతోంది. మే 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్ నుంచి టీజర్‌ని రిలీజ్ చేయ్యనున్నట్లు ప్రొడ్యూసర్ శ్రీనివాస్ చిట్టూరి ప్రకటించారు. ప్రస్తుతం కస్టడీ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న శ్రీనివాస్ చిట్టూరి, బోయపాటి శ్రీను-రామ్ పోతినేని ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ టీజర్ రిలీజ్ డేట్‌ని చెప్పారు. టీజర్ బయటకి వస్తుంది కానీ టైటిల్‌ని రివీల్ చెయ్యట్లేదని సమాచారం.

పది భాగాలుగా భారతం



రాజమౌళి కలల ప్రాజెక్టు 'మహాభారతం' గురించి ఇటీవల ఓ సమావేశంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమాను భారీ స్థాయిలో చరిత్రలో నిలిచిపోయేలా తీయాలన్నది ఆయన కలగా చెప్పారు. 'మహాభారతాన్ని' పది భాగాలుగా తీసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. 'ఒకవేళ 'మహాభారతం' తీయాలంటే దానికి సంబంధించి భారతదేశంలో అందుబాటులో ఉన్న అన్ని పుస్తకాలు చదవాలి. దానికి ఏడాదిపైనే సమయం పట్టొచ్చు. అప్పటికీ ఒక్క అక్షరం కూడా పేపర్‌పై పెట్టలేకపోవచ్చు. చాలా పెద్ద ప్రాజెక్టు. 'మహాభారతం' తీస్తే పది భాగాలుగా తీయాల్సి వస్తుందేమోనని నేను ఊహిస్తున్నా. అయితే, ఎన్ని భాగాలుగా అయితే బావుంటుందో కచ్చితంగా చెప్పలేను' అని అన్నారు.

మే 12న 'భువన విజయమ్'



నటుడు సునీల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'భువన విజయమ్'. యలమంద చరణ్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సెన్సార్ పూర్తి చేసుకుంది. బోర్డు ఈ చిత్రానికి క్లీన్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంతేకాదు విడుదల తేదీపై కూడా క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వంద శాతం పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.. మే 12న థియేటర్లలో విడుదల కానుందని తెలియజేస్తూ.. కొత్త లుక్ ఒకటి విడుదల చేశారు. స్టోరీ ఆఫ్ స్టోరీ టెల్లర్స్ థీమ్‌తో వస్తున్న ఈ మూవీ గ్లింప్స్ వీడియోలు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్నాయి. భువన విజయమ్ నుంచి లాంచ్ చేసిన వెన్నెల కిశోర్, రామస్వామి క్యారెక్టర్ గ్లింప్స్ వీడియోలు ఫన్‌గా సాగుతూ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. శ్రీమతి లక్ష్మి సమర్పణలో హిమాలయ స్టూడియో మ్యాన్షన్స్ బ్యానర్‌పై కిరణ్, వీఎస్‌కే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.



'ఎన్‌బీకే 108' తాజా వీడియో..

బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'ఎన్‌బీకే 108' చిత్రం నుండి తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బుధవారం ఆయన సెట్‌లో అడుగుపెట్టారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రం బృందం ఓ వీడియో విడుదల చేశారు. బాలకృష్ణ, కాజల్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కీలక పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీశ్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'ఇండియన్-2'పై ఫోకస్



దర్శకుడు శంకర్ ప్రస్తుతం రామ్‌చరణ్‌తో గేమ్ ఛేంజర్ అనే సినిమాను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ నటిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి అయినట్లు ఆయన తెలిపారు. ఇప్పుడు తన ఫోకస్ ఇండియన్-2 సినిమాకు షిఫ్ట్ చేస్తున్నట్లు ట్వీట్ చేశారు. రామ్‌చరణ్ సినిమాకు ముందే కమల్‌హాసన్‌తో ఇండియన్-2 సినిమాలను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. అప్పట్లో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. తర్వాత మేకర్స్ మధ్య వివాదాలు వచ్చాయి. ఇప్పుడు పరిస్థితులు సద్దుమణగడంతో సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్నారు. అందుకే దర్శకుడు ఇండియన్-2పై ఫోకస్ పెట్టనున్నారు.

నేడు 'ఉస్తాద్ భగత్ సింగ్' ఫస్ట్ గ్లింప్స్



గబ్బర్ సింగ్ కాంబోని రిపీట్ చేస్తూ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా చేస్తున్నారు పవన్, హరీష్ శంకర్. పవన్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ స్టైల్లో సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉండగానే చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ని రెడీ చేస్తున్నారు మైత్రీ మూవీ మేకర్స్ అండ్ టీ. మే 11న ఉస్తాద్ ఫస్ట్ గ్లింప్స్‌ని రిలీజ్ చేయబోతున్నారు. హైదరాబాద్‌లోని సంధ్య 35ఎంఎం థియేటర్‌లో లాంచ్ చేయనున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. దాంతో సోషల్‌మీడియాలో పవన్ అభిమానులు సందడి నెలకొంది.







బాక్సింగ్‌లో పతకాల పంట

- సెమీస్‌కు చేరిన దీపక్, హుసాముద్దీన్, నిషాంత్
- ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

తస్కెంట్(కజకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు నయా చరిత్ర సృష్టించారు. గతంలో ఒక్కో పతకానికే పరిమితమైన భారత బాక్సర్లు.. ఈసారి ఏకంగా మూడు పతకాలను ఖాయం చేశారు. దీపక్, హుసాముద్దీన్, నిషాంత్ సెమీస్‌కు చేరడంతో భారత్‌కు మూడు పతకాలు ఖాయమయ్యాయి. ఇలా భారత్‌కు ఒకేసారి మూడు పతకాలు దక్కడం ఇదే తొలిసారి. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో దీపక్ భోరియా, మహ్మద్ హుసాముద్దీన్, నిషాంత్ దేవ్ ప్రత్యర్థులను చిత్తుచేసి సెమీస్‌కు చేరారు. 51కిలోల విభాగంలో దీపక్ భోరియా 5-0పాయింట్ల తేడాతో కిర్గిజికిస్తాన్‌కు చెందిన నుర్జిగిట్ దుష్‌దేవ్‌పై, నిషాంత్ దేవ్ 5-0పాయింట్ల తేడాతో క్యూబాకు చెందిన సిడెల్ హోర్టాపై ఘన విజయం సాధించగా.. హుసాముద్దీన్ ఉత్కంఠ పోరులో 4-3పాయింట్ల తేడాతో 5వ సీడ్, బల్గేరియాకు చెందిన జావియర్ ఇబానిజ్‌ను చిత్తుచేశాడు. సెమీస్‌కు ముగ్గురు భారత బాక్సర్లు చేరడంతో వీరందరికీ కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది. ఈ టోర్నమెంట్‌లో సెమీస్‌లో ఓడిన ఇద్దరు బాక్సర్లకూ కాంస్య పతకాలు దక్కనున్నాయి. 12న జరిగే సెమీస్‌లో నిషాంత్ దేవ్.. 4వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన అస్లన్‌బెక్ సింబర్జెనోవ్‌తో తలపడనున్నాడు.

గతంలో భారత్‌కు దక్కిన పతకాలు..

2009 : విజేందర్ సింగ్(కాంస్యం)
2011 : వికాశ్ క్రిషన్(కాంస్యం)
2015 : శివ థాపా(కాంస్యం)
2017 : గౌరవ్ బింధూరి(కాంస్యం)
2019 : అమిత్ పంగల్(కాంస్యం)
2021 : ఆకాశ్ కుమార్(కాంస్యం)

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడ్డ ఢిల్లీ

26 పరుగుల తేడాతో చెన్నై గెలుపు



చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు మరోసారి స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. చిదంబరం స్టేడియం వేదికగా చెన్నై నిర్ధేశించిన 168పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ జట్టు 140పరుగులకే పరిమితమైంది. దీంతో చెన్నై జట్టు 27పరుగుల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో రెండోస్థానానికి ఎగబాకింది. ఇక తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 167పరుగులే చేసింది. బౌలర్లకు సహకరించిన పిచ్‌పై చెన్నై బ్యాటర్స్ పరుగులు రాబట్టేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. కాన్వె(10) త్వరగా పెవీలియన్‌కు చేరగా.. లలిత్ యాదవ్ పట్టిన ఓ అద్భుత క్యాచ్‌కు రహానే(21) కూడా ఔటయ్యాడు. మొయిన్ అలీ(7), గైక్వాడ్(24) స్వల్ప స్కోర్‌కే ఔటవ్వడంతో చెన్నై జట్టు 77పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో శివమ్ దూబే(25), రాయుడు(23) ఆదుకున్నారు. చివర్లో ధనా ధన్ ధోనీ(20; 9బంతుల్లో ఫోర్, 2సిక్సర్లు) మెరుపులు తోడయ్యాయి. మిఛెల్ మార్ష్‌కు మూడు, అక్షర్‌కు రెండు, ఖలీల్, లలిత్, కుల్దీప్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో రోషా(35), మనీష్ పాండే(27), అక్షర్(21) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. పథీరణకు మూడు, చాహర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జడేజాకు లభించింది.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	+0.95
చెన్నై	12	7	4	1	15	+0.49
ముంబయి	11	6	5	0	12	-0.25
లక్నో	11	5	5	1	11	+0.29
రాజస్తాన్	11	5	6	0	10	+0.38
బెంగళూరు	11	5	6	0	10	-0.34
పంజాబ్	10	5	5	0	10	-0.47
కోల్‌కతా	10	4	6	0	8	-0.10
హైదరాబాద్	10	4	6	0	8	-0.47
ఢిల్లీ	11	4	7	0	8	-0.60

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించిన దక్షిణాఫ్రికా

ఛెమ్స్‌ఫోర్డ్(ఐర్లాండ్): ఐసిసి వన్డే ప్రపంచకప్-2023కు దక్షిణాఫ్రికా జట్టు అర్హత సాధించింది. ఐర్లాండ్-బంగ్లా మధ్య జరగాల్సిన తొలి వన్డే వర్షం కారణంగా రద్దు కావడంతో దక్షిణాఫ్రికాకు జాక్‌పాట్ దక్కింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్(61) అర్ధశతకం సాధించాడు. చేధనలో ఐర్లాండ్ 16.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 65 చేసిన దశలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్ నిలిపేశారు. అయితే వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ఐర్లాండ్ 3-0తో గెలిస్తే.. ఆ జట్టు నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించేది. తొలి వన్డే వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోవడంతో దక్షిణాఫ్రికాకు ప్రపంచకప్ బెర్త్ దక్కింది. రెండో వన్డే మంగళవారం(12న) జరగనుంది.

ఐపిఎల్‌లో నేడు..
కోల్‌కతా × రాజస్తాన్
(వేదిక: కోల్‌కతా; రా.7.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68